NE click
ePaper
www.shanmukhavelugu.com

RNI : APTEL / 2023 / 89152

షణ్ముఖ
SHANMUKHAVELUGU
# వెలుగు
ప్రతి వార్త వెలుగు వైపు
తెలుగు దినపత్రిక



Good for Health
Best for Readers
THE POWER OF PEN

PL.NO.IR/RNP/SV/26/2026

సంపుటి : 03 సంచిక : 207

గురువారం 06 ఆగస్టు 2026 పేజీలు 8 వెల : రూ.3

Printed by Ongole. Published From Ongle, Nellore, Guntur, Markapur, Bapatla.

## దేశంలోనే తొలిసారి బీసీ రక్షణ చట్టం

**గత వైసీపీ ప్రభుత్వం బీసీలను తీవ్ర ఇబ్బందులకు గురిచేసిందన్న అచ్చెన్నాయుడు**

**(షణ్ముఖ వెలుగు, అమరావతి,ఆగస్టు 05)**

బీసీల సంక్షేమం, భద్రత కోసం దేశంలోనే ఎక్కడా లేని విధంగా ప్రత్యేక రక్షణ చట్టాన్ని ఆంధ్రప్రదేశ్‌లో తీసుకువస్తున్నట్లు రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు వెల్లడించారు. ఈరోజు నిర్వహించిన మీడియా సమావేశంలో బీసీ రక్షణ చట్టం ముసాయిదాలోని కీలక



వివరాలను ఆయన పంచుకున్నారు. ఈ చట్ట రూపకల్పన కోసం గత రెండేళ్లుగా సుదీర్ఘంగా కసరత్తు చేశామని తెలిపిన మంత్రి... 2019-24 మధ్యకాలంలో గత ప్రభుత్వం బలహీనవర్గాలను తీవ్ర ఇబ్బందులకు గురిచేసిందని, వారిపై జరిగిన వేధింపులను అరికట్టేందుకే మేనిఫెస్టోలో ఇచ్చిన హామీ ప్రకారం ఈ చట్టాన్ని తీసుకొస్తున్నామని స్పష్టం చేశారు.తెలుగుదేశం పార్టీ మొదటి నుంచీ బీసీలకు అండగా ఉందన్న అచ్చెన్నాయుడు... నాడు ఎన్టీఆర్ బీసీలకు రిజర్వేషన్లు కల్పిస్తే, చంద్రబాబు వాటిని 27 శాతానికి ▶2లో

## రైతులు ఆత్మహత్యలు చేసుకుంటున్నారు
## కూటమి ప్రభుత్వంపై జగన్ విమర్శనాస్త్రాలు

**దేవరపల్లిలో పొగాకు రైతులను కలిసిన వైఎస్ జగన్**



**(షణ్ముఖ వెలుగు, అమరావతి,ఆగస్టు 05)**

వైసీపీ అధినేత, మాజీ ముఖ్యమంత్రి జగన్.. సీఎం చంద్రబాబు నేతృత్వంలోని కూటమి ప్రభుత్వంపై తీవ్రస్థాయిలో విరుచుకుపడ్డారు. ప్రభుత్వ విధానాల వల్ల రైతులు తీవ్రంగా నష్టపోతున్నారని, ఆత్మహత్యలు చేసుకుంటున్నారని అన్నారు. తూర్పు గోదావరి జిల్లా దేవరపల్లిలో బుధవారం పర్యటించిన ఆయన, పొగాకు కొనుగోలు కేంద్రాన్ని సందర్శించి ▶2లో

## ఎన్డీయే హయాంలో 17.1 కోట్ల మందికి ఉపాధి

**యూపీఏ హయాంలో కేవలం 2.89 కోట్ల ఉద్యోగాలే..**

**మంగళ్ మిలన్‌లో ప్రజెంటేషన్**

**భేటీకి ముగ్గురు ఎన్సీపీఐ ఎంపీల డుమ్మా**

దిల్లీలో జరిగిన ఎన్డీయే పార్లమెంటరీ పార్టీ సమావేశంలో భాజపా అధ్యక్షుడు నితిన్ నబీన్‌తో ప్రధాని మోదీ మాటామంతి. చిత్రంలో కేంద్రమంత్రులు రాజ్‌నాథ్ సింగ్, అమిత్ షా



**(షణ్ముఖ వెలుగు,ఢిల్లీ, ఆగస్టు 05)**

దిల్లీ: ఎన్డీయే 12 ఏళ్ల పాలనలో 17.1 కోట్ల మందికి ఉద్యోగాలొచ్చాయని కేంద్ర ప్రభుత్వం వెల్లడించింది. అదే యూపీఏ పదేళ్ల పాలనలో కేవలం 2.89 కోట్ల మంది యువతే ఉద్యోగాలు పొందారని పేర్కొంది. 2014 నుంచి అమలు చేస్తున్న క్రీడా విధానం కారణంగానే అంతర్జాతీయ క్రీడల్లో భారతీయులు పలు పతకాలు సాధిస్తున్నారని వివరించింది. ఎన్డీయే పార్లమెంటరీ పార్టీ సమావేశం మంగళ్ మిలన్ మంగళవారం పార్లమెంటు ఆవరణలో జరిగింది. ప్రధాని మోదీ, కేంద్ర హోం మంత్రి అమిత్ షా, భాజపా అధ్యక్షుడు నితిన్ నబీన్ తదితరులు దీనికి హాజరయ్యారు. తృణమూల్ నుంచి ఎన్సీపీఐలో చేరి ఎన్డీయే కూటమికి మద్దతిస్తున్న 20 మంది ఎంపీల్లో ముగ్గురు మాత్రం హాజరుకాలేదు. వారిలో ఖలీలుర్ రహమాన్, అబు తాహెర్ ఖాన్, యూసుఫ్ పఠాన్ ఉన్నారు. తాము ఎన్డీయేలో లేమని తాహెర్ ఖాన్ మీడియాకు తెలిపారు. అయితే పశ్చిమ బెంగాల్ ముఖ్యమంత్రి సువేందు అధికారి నిర్వహించే సమావేశాలకు హాజరవుతామని స్పష్టం చేశారు.

**బంకీపుర్, దతియాలపై సమీక్షిస్తాం: నబీన్**

బిహార్‌లోని బంకీపుర్, మధ్యప్రదేశ్‌లోని దతియాల్లో ఓటమిపై సమీక్షిస్తామని భాజపా అధ్యక్షుడు నితిన్ నబీన్ తెలిపారు. ప్రజల తీర్పును శిరసావహిస్తామని స్పష్టం చేశారు. 'రెండు నియోజకవర్గాల్లో ఓటమిపై క్షుణ్ణంగా ఆత్మ పరిశీలన చేసుకుంటాం. కొత్త శక్తి, సంకల్పంతో ప్రజల్లోకి వెళ్తాం. వారి విశ్వాసం పొందేందుకు అలుపు లేకుండా శ్రమిస్తాం' అని ఎక్స్ వేదికగా నబీన్ పేర్కొన్నారు.



## విశాఖ రూపురేఖలు మార్చే
# మాస్టర్ ప్లాన్..

- సీఎం చంద్రబాబు ఉన్నతస్థాయి సమీక్ష
- విశాఖ ఎకనామిక్ రీజియన్ అభివృద్ధి ప్రణాళికలపై సీఎం చంద్రబాబు సమీక్ష
- రూ.9.50 లక్షల కోట్ల భారీ పెట్టుబడులను ఆకర్షించడమే లక్ష్యం
- ప్రభుత్వ వాటాగా రూ.4 లక్షల కోట్లు, ప్రైవేట్ రంగం నుంచి రూ.5.30 లక్షల కోట్లు
- మూలపేట పోర్టు నుంచి రాజమండ్రి అఖండ గోదావరి ప్రాజెక్టు వరకు అభివృద్ధి
- ఏఐ డేటా సెంటర్లు, పోర్టు ఆధారిత పరిశ్రమలు, పర్యాటకంపై ప్రత్యేక దృష్టి

**(షణ్ముఖ వెలుగు, అమరావతి,ఆగస్టు 05)**

ఆంధ్రప్రదేశ్ అభివృద్ధిలో అత్యంత కీలకమైన విశాఖ ఎకనామిక్ రీజియన్ అభివృద్ధి ప్రణాళికలపై ముఖ్యమంత్రి చంద్రబాబు అమరావతిలో ఉన్నతస్థాయి సమీక్ష నిర్వహించారు. ఈ బృహత్ ప్రాజెక్టు ద్వారా సుమారు రూ.9.50 లక్షల కోట్ల భారీ పెట్టుబడులను ఆకర్షించడం లక్ష్యంగా ప్రభుత్వం ముందుకు సాగుతోంది.ఈ సమీక్షా సమావేశంలో వీఈఆర్ ప్రాజెక్టు ఆర్థిక స్వరూపాన్ని, కార్యాచరణను అధికారులు ముఖ్యమంత్రికి వివరించారు. మొత్తం పెట్టుబడులలో భాగంగా ప్రభుత్వం రూ.3.50 లక్షల కోట్ల నుంచి రూ.4 లక్షల కోట్ల వరకు సమకూర్చాలని, మిగిలిన రూ.5.30 లక్షల కోట్లను ప్రైవేట్ రంగం నుంచి రాబట్టేలా పక్కా ప్రణాళికతో ముందుకెళ్లాలని ▶2లో



## హార్ముజ్‌ను వెంటనే తెరవకుంటే... ఇరాన్‌కు ట్రంప్ ఘాటు హెచ్చరికలు

**ఇరాన్‌తో చర్చలు జరుగుతున్నాయన్న ట్రంప్**

**(షణ్ముఖ వెలుగు,ఢిల్లీ, ఆగస్టు 05)**

హార్మూజ్ జలసంధిని వెంటనే తెరవకపోతే ఇరాన్ తీవ్ర పరిణామాలు ఎదుర్కోవాల్సి వస్తుందని అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ హెచ్చరించారు. ఈ అంశంపై ఇరాన్‌తో చర్చలు సాగుతున్నాయని తెలిపారు. అయితే ఇరాన్ మాత్రం ▶2లో

## గ్లోబల్ ఐటీ మ్యాప్‌పై విశాఖ..

**'ఐబీఎం ఫ్యూచర్ నౌ' సెంటర్ ప్రారంభించిన మంత్రి లోకేశ్**

**విశాఖలో ఐబీఎం కొత్త ఆఫీస్**

**ప్రపంచవ్యాప్త ఏఐ, డిజిటల్ సేవలకు ఈ కేంద్రం సపోర్ట్**

**ఏపీ యువతకు ఉపాధి, నైపుణ్యాభివృద్ధి లక్ష్యమని ప్రభుత్వం వెల్లడి**

**(షణ్ముఖ వెలుగు, అమరావతి,ఆగస్టు 05)**




విశాఖపట్నం ఐటీ రంగంలో మరో కీలక మైలురాయిని అందుకుంది. ప్రపంచ టెక్నాలజీ దిగ్గజం ఐబీఎం, తన నూతన 'ఐబీఎం కన్సల్టింగ్ ఫ్యూచర్‌నౌ సెంటర్'ను విశాఖలో ఘనంగా ప్రారంభించింది. ప్రపంచవ్యాప్తంగా ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ (ఏఐ), డిజిటల్ ట్రాన్స్‌ఫర్మేషన్ సేవలకు మద్దతు ఇచ్చే లక్ష్యంతో ఈ కేంద్రాన్ని ఏర్పాటు చేశారు. నగరంలోని ఇసుకతోట జంక్షన్‌లో ఉన్న లాన్సమ్ స్క్వేర్ భవనంలో ఏర్పాటు చేసిన ఈ సెంటర్‌ను రాష్ట్ర విద్య, ఐటీ శాఖల మంత్రి నారా లోకేశ్, ఐబీఎం ఇండియా, సౌత్ ఏసియా మేనేజింగ్ డైరెక్టర్ సందీప్ పటేల్‌తో కలిసి బుధవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా అక్కడి ఏఐ గవర్నెన్స్ ఇంటిలిజెన్స్, కెమికల్స్ అండ్ పెట్రోలియం ఇండస్ట్రీ ఆపరేషన్స్ వంటి విభాగాల గురించి మంత్రి ఆసక్తిగా అడిగి తెలుసుకున్నారు.ఈ ఫ్యూచర్‌నౌ సెంటర్, ప్రపంచవ్యాప్తంగా ఉన్న ఐబీఎం ▶2లో

## అమరావతే ఏపీ ఆత్మగౌరవం.. జగన్ పాలనపై విరుచుకుపడ్డ హోంమంత్రి అనిత

**అమరావతి పనులను పరిశీలించిన అనిత, కొండపల్లి శ్రీనివాస్**

**మూడు రాజధానుల పేరుతో ప్రజలను జగన్ మోసగించారన్న అనిత**

**(షణ్ముఖ వెలుగు, అమరావతి,ఆగస్టు 05)**



అమరావతి వేదికగా జరుగుతున్న అభివృద్ధి పనులను క్షేత్రస్థాయిలో పరిశీలించిన రాష్ట్ర హోంమంత్రి అనిత, మంత్రి కొండపల్లి శ్రీనివాస్ కీలక వ్యాఖ్యలు చేశారు.

ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర భవిష్యత్తు, ప్రజల ఆత్మగౌరవం అమరావతిలోనే ప్రతిబింబిస్తున్నాయని మంత్రులు స్పష్టం చేశారు. ఈరోజు రాజధాని పనుల పురోగతిని దగ్గరుండి ▶2లో

## వైసీపీని మూసుకోవడమే ఉత్తమం: నారా లోకేశ్
## రాజీనామా డిమాండ్‌పై యనమల తీవ్ర ఆగ్రహం!

**వైసీపీ డిమాండ్ అసంబద్ధమైనదన్న యనమల**

**ఆ పార్టీ వెంటిలేటర్ పై ఉందని ఎద్దేవా**

**రాష్ట్ర అభివృద్ధికి వైసీపీ అవరోధంగా మారిందని విమర్శ**



**(షణ్ముఖ వెలుగు, అమరావతి,ఆగస్టు 05)**

మంత్రి నారా లోకేశ్ రాజీనామా చేయాలంటూ వైసీపీ చేస్తున్న రచ్చపై తెలుగుదేశం పార్టీ సీనియర్ నాయకుడు, మాజీ మంత్రి యనమల రామకృష్ణుడు నిప్పులు చెరిగారు. వైసీపీ వైఖరిని తీవ్రంగా తప్పుబట్టిన ఆయన.. ఆ డిమాండ్ పూర్తిగా ▶2లో

## జగన్ పర్యటనలో వైకాపా కార్యకర్తల వీరంగం

**(షణ్ముఖ వెలుగు, అమరావతి,ఆగస్టు 05)**

తూర్పు గోదావరి జిల్లా దేవరపల్లిలో వైకాపా అధినేత జగన్ పర్యటనలో ఆ పార్టీ కార్యకర్తలు వీరంగం సృష్టించారు. హెలిప్యాడ్ వద్దకు ఒక్కసారిగా దూసుకువచ్చారు. దీంతో అక్కడ తోపులాట చోటుచేసుకుని.. బారికేడ్లు విరిగిపోయాయి. మరోవైపు దేవరపల్లి ప్రధాన రహదారులపై అతివేగంగా, ప్రమాదకరంగా డ్రైవింగ్ చేస్తూ కార్యకర్తలు వీరంగం సృష్టించారు. బైక్‌ల సైలెన్సర్లు తొలగించి పెద్ద ఎత్తున శబ్దాలు చేస్తూ కూడళ్లలో స్టంట్స్ చేశారు. దీంతో స్థానికులు ఇబ్బందులు పడ్డారు. ఓ టిఫిన్ సెంటర్ పైకెక్కి వైకాపా కార్యకర్తలు నృత్యాలు చేశారు. దుకాణంలో సామాగ్రిని ధ్వంసం చేశారు.

## శ్రీశైలం నుంచి రాయలసీమకు నీటి విడుదల..

**ప్రాధాన్యత తాగునీటికేనన్న మంత్రి నిమ్మల**

**శ్రీశైలం జలాశయంలో 119 టీఎంసీల నీరు ఉందన్న నిమ్మల**

**రాబోయే 10 రోజుల్లో మరో 100 టీఎంసీల నీరు వచ్చే అవకాశం ఉందని వెల్లడి**

**(షణ్ముఖ వెలుగు, అమరావతి,ఆగస్టు 05)**



రాయలసీమ ప్రాంత తాగునీటి అవసరాలను తీర్చేందుకు శ్రీశైలం రిజర్వాయర్ నుంచి నీటిని విడుదల చేసినట్లు ఆంధ్రప్రదేశ్ జలవనరుల శాఖ మంత్రి నిమ్మల రామానాయుడు తెలిపారు. ఎల్‌నినో పరిస్థితులను అధిగమించేందుకు రాబోయే 2027 జూన్ వరకు శ్రీశైలం జలాలను ప్రధానంగా తాగునీటి అవసరాలకే భద్రపరచాలని నిర్ణయించినట్లు వెల్లడించారు. ▶2లో


ప్రకాశం


మార్కాపురం


బాపట్ల

షణ్ముఖ
వెలుగు
ప్రతి వార్త వెలుగు వైపు    తెలుగు దినపత్రిక
06.08.26    గురువారం


# మాజీ ఎంపి కాటూరి నారాయణస్వామి విక్రయించిన స్థలాలనే
# కబ్జా చేస్తున్న టీడీపీ నేతలు



**సొసైటీ ఛైర్మన్ పదవి పొంది**
**6 నెలలు కాకుండానే రిజిస్ట్రేషన్లు చేస్తున్న వైనం**
**సొసైటీ అధ్యక్షుడితో పిలిపించి మాట్లాడి సక్రమం చేయకపోతే**
**మీ ప్రభుత్వానికి, మీకే చెడ్డపేరు**
**ప్రజలు భయాందోళనలో ఉన్నారు**
**మీ పార్టీకి ఓట్లు వేసిన వారికే ఈ దుస్థితి**
**భ్రమరా వెంచర్ పై దర్యాప్తు చేయించండి**
**మీడియ సమావేశంలో మాజీ ఎమ్మెల్యే అన్నా వెంకట రాంబాబు**

**(షణ్ముఖ వెలుగు స్టాఫ్ రిపోర్టర్, మార్కాపురం, ఆగస్టు 5)**

పొదిలి రూరల్ హౌసింగ్ సొసైటీలో దాదాపు 50, 60 ఏళ్ళ క్రితం మాజీ పార్లమెంటు సభ్యులు కాటూరి నారాయణ స్వామికుటుంబ సభ్యులు విక్రయించిన స్థలాలను నేడు ఆ సొసైటీని అడ్డు పెట్టుకుని అక్రమ రిజిస్ట్రేషన్లు చేయడం దుర్మార్గమైన చర్య అని గిద్దలూరు మాజీ ఎమ్మెల్యే, మార్కాపురం వైసీపీ ఇన్‌ఛార్జి అన్నా వెంకట రాంబాబు తీవ్రస్థాయిలో విమర్శలు గుప్పించారు. బుధవారం మార్కాపురం పట్టణంలోని వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేసంలో ఆయన మాట్లాడారు. పొదిలి రూరల్ హౌసింగ్ సొసైటీ అధ్యక్షుడిగా నియమితులైన వ్యక్తి పట్టుమని ఆరు నెలలు కూడా పూర్తి కాలేదన్నారు. అప్పుడే పట్టణంలో ఏళ్ళ తరబడి నివాసం ఉంటున్న కొన్ని గృహాలకు మా భూములు అంటూ సొసైటీ పేరుతో అక్రమ రిజిస్ట్రేషన్లు చేశారన్నారు. ఇది ఎంత మాత్రం సహించరానిదన్నారు. పొదిలి పట్టణ ప్రజలు భయాందోళనలో ఉన్నారన్నారు. ఇప్పటికైనా మీ అధ్యక్షుడిని పిలిపించి మాట్లాడి మీ ప్రభుత్వానికి మీకు చెడ్డ పేరు రాకుండా అక్రమ రిజిస్ట్రేషన్లు చేసిన వాటిని సరి చేసి చర్యలు తీసుకోవాలని ఎమ్మెల్యే కందుల నారాయణరెడ్డికి సూచించారు. బుధవారం మీడియా సమావేశం నిర్వహించిన సొసైటీ ఛైర్మన్ మాట్లాడుతూ ఒక్కోరికి 10, 12 ఇళ్ళు ఉన్నాయని చెప్పడానికి మీరు మీడియా సమావేశం పెట్టిందని ప్రశ్నించారు. పదవి చేపట్టిన ఆరు నెలల్లోనే 8 నోటీసులు జారీ చేశామని ఆయన చెప్పడం ఎంత వరకు సమంజసమన్నారు. అసలు పొదిలిని ఏం చేయాలనుకుంటున్నారు. పొదిలి ప్రాంతంలో ఉన్న పెద్ద పొలిటకల్ లీడర్, ఏ పార్టీ అయినా సరే గౌరవమిచ్చే మాజీ ఎంపి కాటూరి నారాయణస్వామి విక్రయించారు. దానిని కూడా మీరు నూతనంగా ఎన్నిక చేసిన సొసైటీ ఛైర్మన్ అది మీదు కాదు సొసైటీ స్థలం అని చెప్పి దుర్మార్గంగా రిజిస్ట్రేషన్ చేయడం ఎంత వరకు సమంజసమన్నారు. ఇటువంటి వారిని సొసైటీ ఛైర్మన్‌గా ఎంపిక చేయడం ఎమ్మెల్యే కందుల నారాయణరెడ్డి ఇష్టం అని అన్నారు. ప్రజలకు ఎంత నష్టం జరుగుతుందో గమనించుకోవాలన్నారు. ఓడిపోయిన ప్రతిపక్షంలో ఉన్న తమకే ఇంత బాధగా ఉంటే ఇక ఓట్లు వేసిన గెలిపించిన మీకు ఎంత ఉంటుందో ఆలోచించుకోవాలి. తాను మిమ్ములను విమర్శించడం లేదని తప్పును సరి చేసుకునే విధంగా వకాల్తా తీసుకోవాలని కందుల కు సూచించారు. ఎవరైతే పొరపాట్లు చేస్తున్నారో చూసుకుని వాటిని సరి చేసుకోవాలని సూచించారు. అలా కాకుండా సొసైటీ వారు ఇలాగే ముందుకు పోతే మేము కూడా చాలా ప్రశ్నలు లేవనెత్తాల్సి వస్తుంది. అంత అవకాశం మాకు ఇవ్వవద్దు. బాధితులకు న్యాయం చేయాలని కోరారు. ఇప్పటికే తమకున్న సమాచారం మేరకు 5 రిజిస్ట్రేషన్లు చేసినట్లు తెలిసింది. ఇంత దుర్మార్గం పనికిరాదన్నారు. ఇప్పటికైనా వాటిని సరిదిద్దుకుని ఆ రిజిస్ట్రేషన్లు ను రద్దు చేసి వారికి భయాందోళన లేకుండా చూడాలని సూచించారు. మీరు చెబుతున్న వ్యక్తులు ఎవరు కూడా అన్యాయంగా దోచుకోలేదని, 79, 80, 82 సంవత్సరాలలో కొనుగోలు చేశారన్నారు. అమ్మిన వారిలో కూడా గౌరవ ప్రదమైన వ్యక్తులు కూడా ఉన్నారన్నారు. ఇవన్నిటిని సరి చేసుకోవాలని కోరారు. ఇక మార్కాపురం విషయానికి వస్తే పట్టణ శివార్లలో ఏర్పాటు చేసిన భ్రమరా వెంచర్స్ లో ఉన్న ఆక్రమణలు, ఆరోపణల పై సమగ్రమైన దర్యాప్తు చేయించాలని డిమాండ్ చేశారు. మార్కాపురం రెవెన్యూ పరిధిలో ఉన్న ప్రభుత్వ భూములు, దేవదాయ భూములు, నీటి చెరువులు, కుంటలు, పంట కాలువలు, చెరువు నుంచి ఆయకట్టు భూములకు నీరు వెళ్లే ప్రధాన కాలువలు, వాటికి ఇరువైపులా ఉండే సర్వీసు రోడ్డు మార్జిన్లు, వాగులు తదితర వాటిని కొందరు దురాక్రమణ చేసి స్వాధీన పరుచుకున్నారన్నారు. వాటి పక్కనే ఉన్న పట్టా భూములను కూడా కలుపుకుని ఆక్రమించిన భూమి అసలైన సర్వేనంబరు కాకుండా తప్పుడు సర్వే నంబర్ల ద్వారా రిజిస్ట్రేషన్ డాక్యుమెంట్లలో రాసి అమ్మకాలు చేస్తూ ప్రభుత్వ ఆస్తులను దోపిడీ చేస్తున్నారని అన్నారు. భ్రమరా వెంచర్స్ వారు ప్రభుత్వ భూములు, చెరువులకు నీరు వచ్చే వాగు, బండ్ల రస్తా లను కలుపుకున్నారనే అభియోగాలు ఉన్నాయని అన్నారు. ఆ వెంచరుకు రహదారి సౌకర్యం లేదని, నీళ్లు వచ్చే వాగుకు అడ్డంగా కల్వర్టులు కట్టి తారురోడ్డు వేశారన్నారు. దీని వలన చెరువుకు రావాల్సిన నీరు ఆగిపోయి లోతట్టు ప్రాంతం మునిగిపో తుందన్నారు. ఇప్పటికే చెరువులు పూడ్చి రోడ్డు వేసే ప్రాంతానికి పక్కనే చెరువులో అంతర్భాగమైన ప్రాంతాన్ని పట్టా భూములని చెప్పి మట్టితోలారని అన్నారు. ఇంత జరుగుతున్నా నీటి పారుదల, రెవెన్యూ, మున్సిపల్ అధికారులు చోద్యం చూస్తున్నారని మండిపడ్డారు. చెరువులో ఎఫ్‌ఎల్ (చెరువు నిండే పూర్తి సామర్థ్యం) ఆ పైన 50 మీటర్ల వరకూ బఫర్ జోన్ ఉంటుందన్నారు. అందులో కూడా శాశ్వత నిర్మాణాలు చేపట్టకూడదని అన్నారు. మార్కాపురం పరిసర ప్రాంతాల్లో దేవదాయ శాఖ భూములు చాలా ఉన్నాయని, అందులో కూడా భారీగా ఆక్రమణలు జరిగాయన్నారు. ఆశాఖ అధికారులు వ్యక్తిగత లబ్ది కోసం కొందరికి మాత్రమే నోటీసులు ఇచ్చి కొన్ని ఆస్తులను స్వాధీన పరుచుకున్నారని, మరికొందరు ఆక్రమణదారుల పై ఉదాసీనంగా ఉంటూ ఆస్తులను స్వాధీనపరుచుకోలేదన్నారు. వారికి కనీసం నోటీసులు కూడా ఇవ్వలేదన్నారు. దీని వలన దేవదాయ శాఖ ఆస్తులు కోల్పోతుందన్నారు. కొందరు అధికారుల సహకారంతో వాస్తవ సర్వే నంబర్లతో కాకుండా వేరే నంబర్లు వేసి నిషేధిత భూములను సైతం రిజిస్ట్రేషన్ చేస్తున్నారని ఆరోపించారు. భూ దోపిడీ పై ప్రత్యేక దృష్టి పెట్టాలని కోరారు. చెరువును దురాక్రమణదారుల నుంచి కాపాడాలన్నారు. ఈ మీడియా సమావేశంలో మాజీ మార్కెట్ యార్డ్ ఛైర్మన్ గొల్లమారి శ్రీనివాసరెడ్డి, తర్లపాడు మండల కన్వీనర్ వెంకటేశ్వర్లు, ఇతర నాయకులు, తదితరులు పాల్గొన్నారు.



## పారిశ్రామిక అభివృద్ధి, 20 లక్షల ఉద్యోగాల కల్పనే రాష్ట్ర ప్రభుత్వ ధ్యేయం

విద్యుత్‌శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్
ప్రకాశం జిల్లాలో ఆర్ఈఎంజెడ్ ప్రాజెక్టు రైతులకు
జిల్లా కలెక్టర్ పి రాజాబాబుతో కలిసి మొదటి విడత
పరిహార చెక్కుల పంపిణీ



## వరికపూడిశెల నిర్మాణమే జీవితాశయం

మీడియా సమావేశంలో ఎమ్మెల్యే జూలకంటి
లిఫ్ట్ ఇరిగేషన్ ప్రాజెక్టులకు పునర్జీవం
వర్షభావ పరిస్థితిని అధిగమించేలా చర్యలు
ఇరిగేషన్ అధికారులతో ఎమ్మెల్యే దిశానిర్ధేశం



## విద్యాభివృద్ధిలో జూలకంటి నాగిరెడ్డి మార్క్

**విజ్ఞాన జ్యోతికి వంద సంవత్సరాలు పూర్తి**
**తుమృకోట పాఠశాల శతాబ్ది వేడుకల్లో జూలకంటి**

**(షణ్ముఖ వెలుగు, మాచర్ల టౌన్, ఆగస్టు 5)**

వెనుకబడి పల్నాడు ప్రాంతంలో విద్యాభివృద్ధికి తనదైన మార్క్ వేసుకున్న మహానీయులు మాజీ ఎమ్మెల్యే స్వర్గీయ జూలకంటి నాగిరెడ్డి అని ఎమ్మెల్యే జూలకంటి బ్రహ్మానందరెడ్డి గుర్తు చేశారు. బుధవారం మండల పరిధిలోని తుమృకోట గ్రామంలోని ఎంపీపీ స్కూల్ శతాబ్ధి వేడుకల్లో ఆయన ముఖ్య అతిధిగా పాల్గొన్నారు. వేడుకలకు విచ్చేసిన ఎమ్మెల్యేను గ్రామ ప్రజలు, ఉపాధ్యాయులు ఘనంగా స్వాగతం పలికారు. విద్యార్థుల సాంస్కృతిక నృత్యాలు ఆకట్టుకున్నాయి. అనంతరం కార్యక్రమాన్ని ఉద్దేశించి ఆయన మాట్టాడారు. వందేళ్ల క్రితమే గ్రామంలో విజ్ఞాన జ్యోతులు వెలిగాయని, ఎందరినో తీర్చిన ఈ ప్రభుత్వ పాఠశాల నియోజకవర్గానికే ఆదర్శమన్నారు. కూటమి ప్రభుత్వంలో ప్రభుత్వ విద్యకు పెద్దపీట వేస్తుస్తోందని, దార్శనికులైన ముఖ్యమంత్రి చంద్రబాబు విద్యకు, సాంకేతికతకు అధిక ప్రాధాన్యత ఇస్తున్నారని చెప్పారు. మాచర్ల నియోజకవర్గంలో విద్యా వ్యాప్తికి, విద్యాలయాల అభివృద్ధికి తన తండ్రి, (తరువాయి 4లో...)

## సొసైటీలో అక్రమ రిజిస్ట్రేషన్లు చేయలేదు



సొసైటీ ఛైర్మన్ మీగడ ఈశ్వర్‌రెడ్డి
మూడు రిజిస్ట్రేషన్లు జరిగాయని నిర్థారించిన
పొదిలి సబ్ రిజిస్ట్రార్
రిజస్టర్లు ఎవరు చేశారో తేల్చాల్సిన అధికారులు
1946 నుంచి జనరల్ బాడీ సమావేశాలకు
సంబంధించిన పత్రాలు అందించాలి
గడిచిన 15 ఏళ్ళలో సొసైటీ స్థలాల్లో నివాసం
ఉంటున్న వారికి ఎన్ని నోటీసులు అందించారు
మీడియా ప్రశ్నలకు సరైన సమాచారం కరువు

**(షణ్ముఖ వెలుగు, పొదిలి, ఆగస్టు 5)**

పొదిలి హౌసింగ్ సొసైటీలో ఎలాంటి ఆక్రమణలు జరిగినా చర్యలు తీసుకుంటామని ఛైర్మన్ మీగడ ఈశ్వర్‌రెడ్డి తెలిపారు. బుధవారం పట్టణంలోని సొసైటీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. సోమవారం కొందరు వ్యక్తులు సొసైటీ అక్రమంగా రిజిస్ట్రేషన్లు చేసిందంటూ తమ పై ఆరోపణలు చేశారన్నారు. అవి వాస్తవం కాదన్నారు. పొదిలి హౌసింగ్ కోఆపరేటివ్ సొసైటీ పేరుతో పొదిలి పట్టణంలోని కాలేజీ రోడ్డులో రెండు ఇళ్ళను, ఓ ఖాళీ స్థలాన్ని అక్రమంగా రిజిస్ట్రేషన్ చేయడం పై మీడియా ప్రతినిధులు ప్రశ్నించగా తాము ఎలాంటి రిజిస్ట్రేషన్లు చేయలేదన్నారు. ఈ నెల 23వ తేదీన రిజిస్ట్రేషన్లు జరిగినట్లు తమ వద్ద పూర్తి ఆధారాలు ఉన్నాయని చెప్పినా తానేమీ రిజిస్ట్రేషన్లు చేయలేదని ఖారఖండిగా తేల్చి చెప్పారు. సొసైటీ ఏర్పడిన 1946 నుంచి జనరల్ బాడీ సమావేశాలకు సంబంధించిన పూర్తి వివరాలు ఉన్నాయా అని ప్రశ్నించగా జిల్లా అధికారులతో మాట్లాడి పూర్తి వివరాలు తెలియజేస్తామన్నారు. అదే విధంగా గడిచిన 15 సంవత్సరాల్లో సొసైటీ స్థలాలు ఆక్రమించిన వారికి ఎంత మంది నోటీసులు జారీ చేశారని ప్రశ్నించగా సమాధానం లేదు. మొత్తం మీద పొదిలి పట్టణంలో సొసైటీ స్థలాల అక్రమ రిజిస్ట్రేషన్ల వ్యవహారం తీవ్ర స్థాయిలో చర్చ సాగుతోంది.

**మూడు రిజిస్ట్రేషన్లు మాత్రమే జరిగాయి**

ఇదే సమయంలో పొదిలి సబ్ రిజిస్టార్‌ను మీడియా ప్రతినిధులు కలవగా సొసైటీకి సంబంధించి కేవలం మూడు రిజిస్ట్రేషన్లు మాత్రమే చేశామని చెప్పడం గమనార్హం. డాక్యుమెంట్ నెంబర్ 5841/2026, 5842/2026, 5843/2026 నెంబర్లతో రిజిస్ట్రేషన్లు చేసినట్లు తెలిపారు. పైగా వీటిలో రెండు ఇళ్ళను ఖాళీ స్థలాలుగా చూపించి రిజిస్టర్ చేయడం జరిగిందని ప్రశ్నించగా ఆ విషయాన్ని పరిశీలిస్తామని తెలిపారు.

## గుంటూరు ఛానల్‌కు గ్రీన్‌సిగ్నల్ !

పొడిగింపు పనులకు వేగం.. కదిలిన భూసేకరణ
జల వనరుల మంత్రి నిమ్మలతో ఎమ్మెల్యే ఏలూరి భేటీ
సాంకేతిక సమస్యలు పరిష్కరించి పనులు
ప్రారంభిస్తామని మంత్రి హామీ
నెలాఖరులోగా 13ఏ నోటిఫికేషన్
రెవెన్యూ మంత్రి అనగాని స్పష్టీకరణ



**(షణ్ముఖ వెలుగు, పర్చూరు, ఆగస్టు 5)**

పర్చూరు నియోజకవర్గ రైతుల చిరకాల స్వప్నమైన గుంటూరు ఛానల్ పొడిగింపు పనులకు ఎట్టకేలకు కదలిక వచ్చింది. ప్రాజెక్టుకు సంబంధించిన సాంకేతిక సమస్యలను పరిష్కరించడంతో పాటు భూసేకరణ ప్రక్రియను వేగవంతం చేసేందుకు ప్రభుత్వ స్థాయిలో చర్యలు ప్రారంభమయ్యాయి. ఈ అంశంపై ఎమ్మెల్యే ఏలూరి సాంబశివరావు వరుసగా సంబంధిత మంత్రులను కలిసి సమస్యలను వారి దృష్టికి తీసుకెళ్లారు. జల వనరుల శాఖ మంత్రి నిమ్మల రామానాయుడుతో భేటీ అయి పనులను త్వరితగతిన ప్రారంభించాలని కోరగా సానుకూలంగా స్పందించిన మంత్రి అవసరమైన చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. మరోవైపు భూసేకరణకు సంబంధించి రెవెన్యూ మంత్రి అనగాని సత్యప్రసాద్ నుంచి కూడా కీలక హామీ లభించింది.

**మంత్రి నిమ్మలతో ఏలూరి భేటీ**

గుంటూరు ఛానల్ పొడిగింపు పనులపై జల వనరుల శాఖ మంత్రి నిమ్మల రామానాయుడును ఎమ్మెల్యే ఏలూరి సాంబశివ రావు కలిసి చర్చించారు. ఛానల్ పొడిగింపునకు సంబంధించిన సాంకేతిక సమస్యలను త్వరితగతిన పరిష్కరించాలని కోరారు. పనులు ఆలస్యం కావడం వల్ల రైతులు ఎదుర్కొంటున్న ఇబ్బందులను వివరించి.. ఇకపై జాప్యం లేకుండా పనులు ప్రారంభించేలా చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు. ఎమ్మెల్యే విజ్ఞప్తిపై మంత్రి నిమ్మల (తరువాయి 4లో...)

# పారిశ్రామిక అభివృద్ధి, 20 లక్షల ఉద్యోగాల కల్పనే రాష్ట్ర ప్రభుత్వ ధ్యేయం



(షణ్ముఖ వెలుగు, అద్దంకి, ఆగస్టు 5)

రాష్ట్రంలో పారిశ్రామిక రంగాన్ని వేగవంతంగా అభివృద్ధి చేయడంతో పాటు 20 లక్షల ఉద్యోగ అవకాశాలు కల్పించడమే లక్ష్యంగా రాష్ట్ర ప్రభుత్వం పనిచేస్తోందని విద్యుత్‌శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్ తెలిపారు. బుధవారం అద్దంకి స్థానిక రెవెన్యూ డివిజనల్ కార్యాలయంలో జిల్లా కలెక్టర్ పి రాజాబాబుతో కలిసి, మొదటి విడత కింద భూములు ఇచ్చిన రైతులకు పరిహార చెక్కులను మంత్రి పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ, పరిశ్రమల ఏర్పాటు వల్ల కలిగే ప్రయోజనాలను రైతులకు స్పష్టంగా వివరించి, ఎటువంటి బలవంతం లేకుండా వారిని ఒప్పించి, ఇష్టపూర్వకంగా భూములు ఇచ్చేలా అవగాహన కల్పిస్తున్నామని స్పష్టం చేశారు. ప్రకాశం జిల్లాలో ప్రతిష్టాత్మకంగా చేపడుతున్న రెన్యూవబుల్ ఎనర్జీ మ్యానుఫ్యాక్చరింగ్ జోన్ ప్రాజెక్టుకు ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యత ఇస్తోందని, దీనివల్ల స్థానిక యువతకు పెద్ద ఎత్తున ఉపాధి లభిస్తుందని పేర్కొన్నారు. ఈ ప్రాజెక్టు నిమిత్తం బల్లికురవ, సంతమాగులూరు మండలాల పరిధిలోని ఎస్.ఎన్. గుడిపాడు, ఈస్ట్ కుందూరు, ముక్కేశ్వరం గ్రామాలలో మొత్తం 1,036.93 ఎకరాల భూమిని గుర్తించడం జరిగిందని మంత్రి వివరించారు. ఇందులో 116.85 ఎకరాల ప్రభుత్వ భూమి ఉండగా (దీనిలో ఇప్పటికే 114 ఎకరాలను చీజుణజూాకు అప్పగించారు), మిగిలిన 920.08 ఎకరాలు పట్టా భూమిగా ఉంది. రైతులందరి అభిప్రాయాలను గౌరవిస్తూ, జిల్లా స్థాయి చర్చల కమిటీ ద్వారా ఎకరాకు రూ. 18 లక్షల చొప్పున నష్టపరిహారాన్ని నిర్ణయించినట్లు ఆయన తెలిపారు. స్వచ్ఛంద భూసేకరణ విధానంలో భూములు అందించిన రైతులకు మొదటి విడత కింద నేడు పరిహారం అందజేశామని మంత్రి వెల్లడించారు. బల్లికురవ మండలం ముక్కేశ్వరం గ్రామానికి చెందిన 8 మంది రైతులకు 1.93 ఎకరాల భూమికి గాను రూ. 34,74,000, ఎస్.ఎన్. గుడిపాడు గ్రామానికి చెందిన 13 మంది రైతులకు 70.58 ఎకరాల భూమికి గాను రూ. 12,70,44,000, అలాగే సంతమాగులూరు మండలం ఈస్ట్ కుందూరు గ్రామానికి చెందిన 16 మంది రైతులకు 102.90 ఎకరాల భూమికి గాను రూ. 18,52,20,000 నష్టపరిహారాన్ని పంపిణీ చేశారు. ఈ రకంగా మొదటి విడతలో మొత్తం 37 మంది రైతులకు చెందిన 175.41 ఎకరాల భూమికి గాను రూ. 31,57,38,000 పరిహారాన్ని కలెక్టర్ రాజాబాబుతో కలిసి లబ్ధిదారులకు అందజేశారు. తమ భూములను స్వచ్ఛందంగా అందించి జిల్లా పారిశ్రామిక అభివృద్ధికి సహకరించిన ప్రతి ఒక్క రైతుకు జిల్లా యంత్రాంగం తరఫున మంత్రి మరియు కలెక్టర్ ప్రత్యేక అభినందనలు తెలిపారు. ఈ ప్రాజెక్టు పూర్తిస్థాయిలో అందుబాటులోకి వస్తే జిల్లాలో పారిశ్రామిక రంగం మరింత పురోగతి చెందుతుందని ఆశాభావం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో అద్దంకి రెవెన్యూ డివిజనల్ అధికారి సిహెచ్ విజయ జ్యోతి కుమారి, ఇతర అధికారులు పాల్గొన్నారు.

## ఆనారోగ్యంతో బాధపడే వారికి ఆపన్న హస్తం ముఖ్యమంత్రి సహాయనిధి

### నియోజకవర్గంలోని 85 మందికి రూ.55,15,730 ముఖ్యమంత్రి సహాయనిధి చెక్కులు పంపిణి చేసిన ఎమ్మెల్యే ముత్తుముల







(షణ్ముఖ వెలుగు, గిద్దలూరు, ఆగస్టు 5)

గిద్దలూరు పట్టణంలోని తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో గిద్దలూరు ఎమ్మెల్యే శ్రీ ముత్తుముల అశోక్ రెడ్డి గారు బుధవారం ఉదయం తెలుగుదేశం పార్టీ కార్యాలయం నందు నియోజకవర్గంలో ఆనారోగ్యంతో బాధపడుతున్న 85 మందికీ 21 వ విడతగా మంజూరయిన రూ.55,15,730ల ముఖ్యమంత్రి సహాయ నిధి చెక్కులను అందచేశారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ ఆనారోగ్యంతో బాధపడే వారికి ముఖ్యమంత్రి సహాయనిధి అనేది ఒక ఆపన్న హస్తం అని, పేదలకు నాణ్యమైన వైద్యం అందించటమే ఎన్డీయే కూటమి ప్రభుత్వ లక్ష్యమని, ప్రస్తుతం పట్టణాల్లోని కార్పొరేట్ హాస్పిటల్స్ లో పేదవారు నాణ్యమైన వైద్యం పొందవచ్చునని, వారికీ అయిన ఖర్చును ముఖ్యమంత్రి సహాయ నిధి ద్వారా పొందవచ్చున్నారు. అనారోగ్య సమస్యలతో బాధపడుతూ అనేకమంది పేద ప్రజలు ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొనుచున్నారని వారికీ అండగా నిలవాలన్నదే చంద్రన్న కూటమి ప్రభుత్వ ధ్యేయమన్నారు. పేద ప్రజలకు ఎటువంటి సమస్య వచ్చిన కూటమి ప్రభుత్వం తక్షణమే స్పందిస్తుందన్నారు. ఇప్పటి వరకు నియోజకవర్గంలోని 1160 మంది నిరుపేదలకు ముఖ్యమంత్రి సహాయ నిధి ద్వారా రూ.10,79,34,309లు అందచేయటం జరిగిందన్నారు. ప్రభుత్వం చేసిన మంచి ప్రతీ ఒక్కరూ గుర్తుంచుకోవాలన్నారు. కూటమి ప్రభుత్వం ఇచ్చిన ప్రతీ హామీని నెరవేరుస్తుందని రాష్ట్రంలో అభివృద్ధి సంక్షేమమే కూటమి ప్రభుత్వ ధ్యేయమన్నారు. ఈ కార్యక్రమంలో మార్కెట్ యార్డ్ చైర్మన్, మండల పార్టీ అధ్యక్షులు, నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

## అంగరంగవైభవంగా పోలేరమ్మ అమ్మవారి ఆషాఢ సారె సమర్పణ





(షణ్ముఖ వెలుగు, చిన్నగంజాం, ఆగస్టు 5)

మండలంలోని రాజుబంగారుపాలెంలో కొలువుదీరిన శ్రీ పోలేరమ్మ అమ్మవారికి గ్రామంలోని మహిళ భక్తులు బుధవారం ఆషాఢ మాసం సందర్భంగా సంప్రదాయబద్ధంగా అషాడ సారె సమర్పించారు. ఈ సందర్భంగా జరిగిన కార్యక్రమంలో వేలాది మహిళలు సాంప్రదాయబద్ధంగా పసుపు, కుంకుమలు, పూలు, పండ్లు, గాజులు, చీర మరియు నూతన వస్త్రాల సారె ను వందలాది మహిళలు నెత్తిన పెట్టుకుని ఆషాఢ సారెను అత్యంత భక్తిశ్రద్ధలతో శోభాయమానంగా మేళతాళాలతో గ్రామంలో ఊరేగింపుగా తిసుకు వేళ్ళి అమ్మవారికి సారె సమర్పించి పూజలు నిర్వహించారు. అషాడ సారె సందర్భంగా భక్తులకు ఏలాంటి ఇబ్బంది లేకుండా అలయ అభివృద్ధి కమిటీ ప్రత్యేక ఏర్పాట్లు చేసారు. మధ్యాహ్నం వేలాది మంది భక్తులకు అన్నధనం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో అధిక సంఖ్యలో మహిళలు, గ్రామ పెద్దలు, యువత పాల్గొన్నారు.

## గుంటూరు ఛానల్‌కు గ్రీన్‌సిగ్నల్ !

సానుకూలంగా స్పందించారు. సాంకేతిక అంశాలను పరిష్కరించి గుంటూరు ఛానల్ పొడిగింపు పనులు ప్రారంభించేలా చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు.

**కొల్లా రాజమోహన్‌రావుతో కలిసి..**

ఈ అంశంపై డాక్టర్ కొల్లా రాజమోహన్‌రావు కూడా ఎమ్మెల్యే ఏలూరి సాంబశివరావును కలిసి చర్చించారు. గుంటూరు ఛానల్ పొడిగింపు పనులను త్వరితగతిన చేపట్టేలా ప్రభుత్వ స్థాయిలో చర్యలు తీసుకోవాలని కోరారు. రైతులకు సాగునీరు అందించడంలో ఈ ప్రాజెక్టు ప్రాధాన్యాన్ని ప్రస్తావించారు.

**భూసేకరణకు కదలిక**

ఛానల్ పొడిగింపు పనులు ప్రారంభించాలంటే భూసేకరణ ప్రక్రియ కీలకం కావడంతో ఆ అంశంపైనా ఎమ్మెల్యే ఏలూరి ప్రత్యేక దృష్టి సారించారు. రెవెన్యూ శాఖ మంత్రి అనగాని సత్యప్రసాద్‌ను కలిసి భూసేకరణ ప్రక్రియను పూర్తి చేయాలని కోరారు. నోటిఫికేషన్ జారీతో పాటు తదుపరి ప్రక్రియను వేగవంతం చేయాలని విజ్ఞప్తి చేశారు.

దీనిపై మంత్రి అనగాని సత్యప్రసాద్ సానుకూలంగా స్పందిస్తూ.. ఈ నెలాఖరులోగా 13-ఏ నోటిఫికేషన్ జారీ చేసేలా చర్యలు తీసుకుంటామని ఎమ్మెల్యే ఏలూరికి వివరించారు.

**రైతుల చిరకాల డిమాండ్‌కు పరిష్కార దిశగా..**

గుంటూరు ఛానల్ పొడిగింపు పూర్తయితే పర్చూరు నియోజకవర్గంలోని సాగు నీటి లభ్యత మెరుగుపడే అవకాశం ఉంది. వ్యవసాయంపై ఆధారపడే వేలాది కుటుంబాలకు ప్రయోజనం చేకూరనుంది. ఈ నేపథ్యంలో ఛానల్ పొడిగింపు పనులపై ప్రభుత్వం తీసుకుంటున్న చర్యలతో రైతుల్లో ఆశలు పెరుగుతున్నాయి.

## వరికపూడిశెల నిర్మాణమే జీవితాశయం

(షణ్ముఖ వెలుగు, మాచర్ల టౌన్, ఆగస్టు 5)

దశాబ్దాల కల వరికపూడిశెల నిర్మాణం తన జీవితాశయమని, అన్నీ అనుమతులతో వచ్చే ఏడాది ఫిబ్రవరి నాటికి శంకుస్థాపన చేసి, పనులు ప్రారంభిస్తామని ఎమ్మెల్యే జూలకంటి బ్రహ్మానందరెడ్డి చెప్పారు. బుధవారం స్థానిక ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో మేజర్,మైనర్ ఇరిగేషన్, నాగార్జున సాగర్ ప్రాజెక్ట్, లిఫ్ట్ ఇరిగేషన్ శాఖల నియోజకవర్గ స్థాయి అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. మేజర్, మైనర్ పంట కాలువల పనితీరు, మరమత్తులు,చెరువు కట్టలు, వాగుల పరిరక్షణ, చెరువుల్లో నీటిని నింపడం, చీరా ఆయకట్టు పటిష్టతకు తీసుకోవాల్సిన చర్యలు, లిప్ ఇరిగేషన్ ప్రాజెక్టుల పనితీరు వంటి పలు అంశాలపై సమీక్షించారు. అనంతరం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఐదేళ్ల వైసీపీ ప్రభుత్వంలో సాగునీటి ప్రాజెక్టులు నిర్వహణను అటకెక్కించారని, కూటమి ప్రభుత్వం అధికారంలోకి రాగానే బుగ్గవాగు రిజర్వాయర్ ప్రాజెక్టు 4 గేట్ల మరమత్తులకు నిధులు కేటాయించి, రూ. 1.40 కోట్లతో కొత్తగా క్రస్టు గేట్లను ఏర్పాటు చేశామన్నారు. మరో 2 గేట్ల ఏర్పాటుకు టెండర్లు ముగిసాయన్నారు. ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు నేతృత్వంలో కూటమి ప్రభుత్వం సాగినీటి ప్రాజెక్టుల నిర్మాణాలు, నిర్వహణ బాధ్యతలకు పెద్ద ఎత్తున నిధులు కేటాయిస్తుందని చెప్పారు. రైతు సంక్షేమానికి అధిక ప్రాధాన్యత ఇచ్చేలా ఇరిగేషన్ ప్రాజెక్టుల నిర్మాణాలు వేగం పుంజుకుంటున్నాయని తెలిపారు.

**లిఫ్ట్ ఇరిగేషన్ ప్రాజెక్టులకు పునర్జీవం..**

నియోజకవర్గ పరిధిలోని 7 లిఫ్ట్ ఇరిగేషన్ ప్రాజెక్టులకు కూటమి ప్రభుత్వం పునర్జీవం పోసేందుకు ప్రణాళికలు సిద్ధం చేస్తుందని ఎమ్మెల్యే జూలకంటి చెప్పారు. అనువు, కొప్పునూరు, నారాయణరెడ్డి పురం, ఏకోనాంపేట,తాళ్లపల్లి, పేటసన్నెగండ్ల, జెర్రివాగు లిఫ్ట్ ఇరిగేషన్ ప్రాజెక్టులన్నీ పట్టాలెక్కించి, రైతాంగానికి ఉపయోగపడేలా చర్యలు తీసుకుంటున్నామని చెప్పారు. రూ.7 కోట్ల నిధులతో ఆ ప్రాజెక్టులను వినియోగంలోకి తీసుకురానున్నట్లు వెల్లడించారు. రూ. 77 కోట్ల నిధులతో దశాబ్ద కాలం పాటు ఆ లిఫ్ట్ ఇరిగేషన్ నిర్వహణ బాధ్యతలను తీసుకోనున్నట్లు చెప్పారు. దీనిపై ఇప్పటికే ప్రతిపాదనలను తయారు చేసి ప్రభుత్వానికి అందజేశామని పేర్కొన్నారు. రూ. 17 కోట్లతో మరోవైపు ధర్మవరం లిప్ ఇరిగేషన్ ప్రాజెక్టు పనులు ప్రారంభం కానున్నాయని చెప్పారు. అలానే చెరువుల అభివృద్ధికి రూ. 4.60 కోట్లతో మరమత్తు పనులకు శ్రీకరం చుట్టనున్నామని తెలిపారు.

**వర్షాబావ పరిస్థితిని అధిగమించేలా చర్యలు..**

ప్రస్తుతం రాష్ట్రంలో ఏర్పడిన ఎల్నినో పరిస్థితిని అధిగమించేలా కూటమి ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందని ఆయన చెప్పారు. ఎగువ కురుస్తున్న వర్షాలకు వస్తున్న వరద నీటిని చెరువులు, కుంటలు నింపుకొని సాగు,తాగునీటి అవసరాలు తీరేలా ప్రణాళికలు సిద్ధం చేయాలని అధికారులు ఆదేశించినట్లు ఆయన తెలిపారు. ఎన్ఎస్పి కుడి కాలువ ఆయకట్టు రైతులకు సాగునీటి సంరక్షణ పై అవగాహన కల్పించేలా కార్యక్రమాలు నిర్వహించేలా చర్యలు తీసుకుంటున్నామని చెప్పారు. ఇప్పటికీ తాగునీటి అవసరాల కోసం కూటమి ప్రభుత్వం 1.865 టీఎంసీల సాగర్ జలాలను అందించేందుకు చర్యలు తీసుకుంటుందని ఆయన వెల్లడించారు. ఆరుదల పంటల వైపు రైతులు అడుగులు వేయాలని, ప్రతి నీటి బొట్టు ను వృధా చేయకుండా సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు.

## విద్యాభివృద్ధిలో జూలకంటి నాగిరెడ్డి మార్క్



మాజీ ఎమ్మెల్యే జూలకంటి నాగిరెడ్డి చేసిన కృషి తనకెంతో గర్వకారణమని కొనియాడారు. ఈ పాఠశాలలోనే 50 ఏళ్ల క్రితం నాగిరెడ్డి చేపట్టిన పాఠశాల భవన నిర్మాణం నేటికీ చెక్కుచెదరలేదని, వంద సంవత్సరాల పూర్తి చేసుకున్న సందర్భంగా తాను హాజరుకావడం ఎంతో ఆనందంగా ఉందని చెప్పారు. పాఠశాల అభివృద్ధికి నేటికీ పాటుపడుతున్న గ్రామస్తులకు, పూర్వ విద్యార్థులకు, ఉపాధ్యాయులకు ఈ సందర్భంగా ఆయన ధన్యవాదాలు తెలిపారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు పోట్ల నరసింహారావు, నరాల అంకారావు, గొంటు సుమంత్ రెడ్డి, అల్లం బ్రహ్మారెడ్డి, రామకృష్ణ, మందలపు హనిమిరెడ్డి, పోట్ల సతీష్, లింగా మాధవరావు, బ్రహ్మయ్య యాదవ్, పాఠశాల సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## మాన్యువల్ స్కావెంజర్లు నివసించే ప్రాంతాలలో అవగాహన ప్రచారం

(షణ్ముఖ వెలుగు, ఒంగోలు, ఆగస్టు 5)

ప్రకాశం జిల్లాలో మాన్యువల్ స్కావెంజర్ల సర్వే ప్రక్రియను జిల్లా స్థాయిలో పర్యవేక్షించడం కోసం జిల్లా కలెక్టర్ అధ్యక్షతన 'జిల్లా సర్వే కమిటీ'ని ఏర్పాటు చేయడం జరుగుతోంది. మాన్యువల్ స్కావెంజర్లు నివసించే ప్రాంతాలలో అవగాహన ప్రచారం కల్పించడం, స్థానిక వార్తాపత్రికల ద్వారా సర్వే వివరాలను ప్రచారం చేయడం, జిల్లాలోని అన్ని పట్టణాలు, నగరాలు మరియు గ్రామాల మాన్యువల్ స్కావెంజర్ల తుది జాబితాను ఆమోదించి ప్రచురించడం, అలాగే వారి పునరావాసం మరియు సంక్షేమం కోసం ఈ కమిటీ పనిచేస్తుంది. ఈ సర్వే మరియు సంక్షేమ కార్యక్రమాలలో భాగస్వామ్యం వహించేందుకు విజిలెన్స్ కమిటీ నామినేషన్ల కోసం దరఖాస్తులు ఆహ్వానించబడుతున్నాయి.

**దీని కోసం:**మాన్యువల్ స్కావెంజర్లు ,సఫాయి కర్మచారీల సంక్షేమం కోసం పనిచేస్తున్న ప్రభుత్వేతర (స్వచ్ఛంద) సంస్థల నుంచి ఇద్దరు (2) ప్రతినిధులు. కమ్యూనిటీకి చెందిన ఇద్దరు (2) ప్రతినిధులు (వీరిలో ఒకరు తప్పనిసరిగా మహిళ అయి ఉండాలి). మొత్తం (4) నలుగురు సభ్యులను కమిటీలోకి ఎంపిక చేయడానికి ప్రతిపాదనలు ఆహ్వానిస్తున్నట్లు జిల్లా సాంఘిక సంక్షేమ శాఖ డిప్యూటీ డైరెక్టర్ ఎన్ లక్ష్మా నాయక్ తెలిపారు. ఆసక్తి గల అభ్యర్థులు 12.08.2026 నాటి సాయంత్రం 5 గంటల లోపు తమ దరఖాస్తులను ఒంగోలులోని ప్రగతి భవన్‌లో ఉన్న డిప్యూటీ డైరెక్టర్, సాంఘిక సంక్షేమ శాఖ కార్యాలయంలో సమర్పించాలన్నారు.

**జతపరచవలసిన పత్రాలు:**కుల ధ్రువీకరణ పత్రం, విద్యార్హత పత్రాలు, చిరునామా ఆధారాలు (ఆధార్ కార్డు, ఓటరు ఐడీ), ఒక పాస్‌పోర్ట్ సైజు ఫోటో, సంస్థ ప్రతినిధులైతే, సఫాయి కర్మచారీల సంక్షేమం కోసం పనిచేస్తున్నట్లు ధ్రువీకరించే పత్రాలు, నిర్ణీత గడువు ముగిసిన తర్వాత వచ్చిన దరఖాస్తులు ఎట్టి పరిస్థితుల్లోనూ స్వీకరించబడవని తెలిపారు.

## గ్రామపంచాయతీ అభివృద్ధి ప్రణాళిక అంశం మీద శిక్షణ కార్యక్రమం



(షణ్ముఖ వెలుగు, ఉలవపాడు, ఆగస్టు 5)

ఉలవపాడు మండల పరిషత్ కార్యాలయం నందు బుధవారం అన్ని శాఖల సమన్వయంతో ప్రతి గ్రామం నందు గ్రామ పంచాయితీ అభివృద్ధి ప్రణాళికలను తయారు చేయుటకు లైన్ డిపార్ట్మెంట్ మండల స్థాయి అధికారులు, అన్ని శాఖల గ్రామ పంచాయతీ స్థాయి అధికారులకు, సిబ్బందికి ఒకరోజు శిక్షణ కార్యక్రమం మండల పరిషత్ కార్యాలయం నందు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో గ్రామ స్థాయిలోనే అన్ని శాఖల సిబ్బంది సమన్వయంతో సకాలంలో గ్రామపంచాయతీ అభివృద్ధి ప్రణాళికలను రూపొందించుటకు అవసరమైన సమాచారాన్ని శిక్షణ ద్వారా ఇవ్వడమైనది. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో బి సురేష్, పశుసంవర్ధకశాఖ ఏడి జి సురేష్ నాయుడు, ఉప మండల అభివృద్ధి అధికారి సిహెచ్ శ్రీనివాసులు, మండల విద్యాధికారి2 ఎం వి రమణయ్య, మండల వ్యవసాయ అధికారి విజయ్ కుమార్, పశు వైద్యాధికారి శ్రీ సాయి, గ్రామీణ నీటి సరఫరా అధికారి ఎస్‌కె నాయబ్ రసూల్, మండల సచివాలయ అధికారి ఎన్ జగదీష్, అంగన్వాడి సూపర్వైజర్లు ఎన్ఆర్ఈజీఎస్ ఏపీవో షేక్ అబ్దుల్లా, పంచాయతీ అభివృద్ధి అధికారులు, ఇంజినీరింగ్ అసిస్టెంట్లు, డిజిటల్ అసిస్టెంట్లు, వెలుగు సిబ్బంది పాల్గొన్నారు.

## సబ్సిడీ ధరకు నాణ్యమైన బియ్యం పంపిణీ జిల్లా కలెక్టర్ ఎం విజయ సునీత





(షణ్ముఖ వెలుగు స్టాఫ్ రిపోర్టర్, మార్కాపురం, ఆగస్టు 5)
ఎల్‌నినో వాతావరణ పరిస్థితులు, వర్షాభావం కారణంగా బహిరంగ మార్కెట్‌లో బియ్యం ధరలు అసాధారణంగా పెరిగిన నేపథ్యంలో, సామాన్య ప్రజలు, రేషన్ కార్డుదారుల పై ఆర్థిక భారం పడకుండా రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక చర్యలు చేపట్టిందని మార్కాపురం జిల్లా కలెక్టర్ ఎం విజయ సునీత తెలిపారు. సివిల్ సప్లైస్ డిపార్ట్‌మెంట్, రైస్ మిల్లర్ల అసోసియేషన్ భాగస్వామ్యంతో ప్రభుత్వం ప్రత్యేక అవుట్‌లెట్ స్టోర్ల ద్వారా తక్కువ ధరకే నాణ్యమైన బియ్యాన్ని అందుబాటులోకి తీసుకువచ్చింది. ఇందులో భాగంగా మార్కాపురం ఎస్టేట్‌లో ఏర్పాటు చేసిన ప్రత్యేక సబ్సిడీ బియ్యం విక్రయ కేంద్రాన్ని స్థానిక ఎమ్మెల్యే కందుల నారాయణరెడ్డి, జాయింట్ కలెక్టర్ పి శ్రీనివాసులుతో కలిసి కలెక్టర్ ప్రారంభించి లబ్ధిదారులకు 10 కేజీల బియ్యం ప్యాకెట్లను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మీడియాతో జిల్లా కలెక్టర్ ఎం విజయ సునీత మాట్లాడుతూ పెరుగుతున్న మార్కెట్ ధరలను నియంత్రించేందుకు రాష్ట్ర ప్రభుత్వం చొరవ తీసుకుని, రైస్ మిల్లర్లతో మాట్లాడి సబ్సిడీ ధరకు బియ్యం అందజేసే సదుపాయం కల్పించిందని, ఈ చొరవకు సహకరించిన రైస్ మిల్లర్స్ అసోసియేషన్‌కు ప్రత్యేక ధన్యవాదాలు తెలియజేశారు.

**తగ్గింపు ధరలు....**

ఈ కేంద్రాల ద్వారా బహిరంగ మార్కెట్‌లో కిలో రూ. 58లు ఉన్న బిపిటి రా బియ్యాన్ని కేవలం రూ. 50లకే (కిలోపై రూ.8 సబ్సిడీ తగ్గింపుతో), అలాగే రూ.62లు ఉన్న బిపిటి స్టీమ్ బియ్యాన్ని రూ.52లకే (కిలో పై రూ. 10 సబ్సిడీ తగ్గింపుతో) నాణ్యమైన క్వాలిటీ బియ్యాన్ని ప్రజలకు అందజేస్తున్నట్లు వెల్లడించారు.

**కార్డుదారులకు పిలుపు...**

రేషన్ కార్డు కలిగిన ప్రతి కుటుంబం తమ ఆధార్ కార్డు లేదా హౌస్‌హోల్డ్ కార్డును చూపి ఈ ప్రత్యేక విక్రయ కేంద్రాల ద్వారా తక్కువ ధరకే నాణ్యమైన బియ్యాన్ని పొంది, ప్రభుత్వం కల్పించిన ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ పి శ్రీనివాసులు, ఎమ్మెల్యే కందుల నారాయణరెడ్డి, పౌర సరఫరా అధికారులు, రైస్ మిల్లర్ల సంఘం ప్రతినిధులు, తదితరులు పాల్గొన్నారు.

## నూతన మున్సిపల్ కమిషనర్‌ను కలిసిన జనసేన నాయకులు శ్రావణి వెంకటేశ్వర్లు



(షణ్ముఖ వెలుగు, పొదిలి, ఆగస్టు 5)
పొదిలి మున్సిపాలిటీ నూతన కమిషనర్‌గా బాధ్యతలు స్వీకరించిన రామ్మోహన్‌రావు ను జనసేన నాయకులు శ్రావణి వెంకటేశ్వర్లు బుధవారం మర్యాదపూర్వకంగా కలిసి శాలువాతో సత్కరించి, పుష్పగుచ్ఛం అందించి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా పొదిలి పట్టణ అభివృద్ధి, ప్రజలకు అవసరమైన మౌలిక సదుపాయాలు, ప్రజా సమస్యల పరిష్కారం పై కమిషనర్‌తో చర్చించారు. పట్టణ అభివృద్ధికి తమవంతు సహకారం అందిస్తామని శ్రావణి వెంకటేశ్వర్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో జనసేన నాయకులు, కార్యకర్తలు కృష్ణ మోహన్, బైక్ అసోసియేషన్ ప్రెసిడెంట్ యుద్ధం శ్రీను, సోములు, పాపారావు, వెంకటేష్, ఏడుకొండలు పాల్గొని నూతన కమిషనర్‌కు శుభాకాంక్షలు తెలిపారు.

## సబ్సిడీ బియ్యం పంపిణీ ప్రారంభించిన ఎమ్మెల్యే కందుల





(షణ్ముఖ వెలుగు, పొదిలి, ఆగస్టు 5)
రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు పొదిలి పట్టణంలోని శ్రీ లక్ష్మీ శ్రీనివాస రైస్ అండ్ ఫ్లోర్ మిల్ నందు సబ్సిడీ ధరకు నాణ్యమైన బియ్యం పంపిణీ కార్యక్రమాన్ని మార్కాపురం ఎమ్మెల్యే కందుల నారాయణరెడ్డి బుధవారం ఘనంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే కందుల నారాయణరెడ్డి మాట్లాడుతూ నిత్యావసర వస్తువుల ధరలు పెరుగుతున్న తరుణంలో పేద, మధ్యతరగతి ప్రజలకు ఉపశమనం కలిగించాలనే లక్ష్యంతోనే రాష్ట్ర ప్రభుత్వం సబ్సిడీపై నాణ్యమైన బియ్యాన్ని అందిస్తోందని తెలిపారు. ప్రజలకు సక్రమంగా, ఎలాంటి ఇబ్బందులు లేకుండా బియ్యం పంపిణీ జరిగేలా చూసుకోవాలని అధికారులకు, మిల్లు నిర్వాహకులకు సూచించారు. అర్హులైన లబ్ధిదారులందరూ ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని కోరారు. ప్రభుత్వం అందిస్తున్న ఈ ఆర్థిక ఉపశమనం పట్ల స్థానిక ప్రజలు, లబ్ధిదారులు సంతోషం వ్యక్తం చేస్తూ హర్షం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో తహశీల్దార్ ఎం వి కృష్ణారెడ్డి, పొదిలి నగర పంచాయతీ కమిషనర్ రామ్మోహన్‌రావు, పొదిలి ఏఎంసి ఛైర్మన్ డాక్టర్ సయ్యద్ ఇమాంసా, పొదిలి నగర పంచాయతీ క్లస్టర్ ఇన్‌ఛార్జి వరికుంట్ల అనిల్, మెడికల్ కౌన్సిల్ మెంబర్ డాక్టర్ స్వర్ణ గీత, ఇతర ప్రజా ప్రతినిధులు, అధికారులు, కూటమి నాయకులు, లబ్ధిదారులు పాల్గొన్నారు.

## ప్రకాశం జిల్లా అండర్14 ఉషు జట్టు ఎంపికలు

(షణ్ముఖ వెలుగు, ఒంగోలు, ఆగస్టు 5)
ప్రకాశం జిల్లా ఉషు అసోసియేషన్ ఆధ్వర్యంలో అండర్ 14 (యు/14) జిల్లా ఉషు సెలక్షన్స్ ఆగస్టు 9న ఆదివారం ఉదయం 10 గంటలకు ఒంగోలు పట్టణంలోని మాంటెస్సోరి స్కూల్ ప్రాంగణంలో నిర్వహించబడనున్నాయని ప్రకాశం ఉషు అసోసియేషన్ ప్రతినిధులు ఒక ప్రకటనలో తెలిపారు. ఈ ఎంపికల్లో ప్రకాశం జిల్లాలోని అన్ని మండలాల నుండి అర్హత కలిగిన 2012 నుండి 2017 డిసెంబర్ 31లోపు జన్మించిన బాలురు, బాలికలు పాల్గొనవచ్చునని అసోసియేషన్ ప్రతినిధులు తెలిపారు. ఎంపికైన క్రీడాకారులు జిల్లా జట్టుకు ప్రాతినిధ్యం వహిస్తూ రాష్ట్రస్థాయి ఉషు పోటీలలో పాల్గొనే అవకాశం పొందుతారని తెలిపారు. ఆసక్తి గల క్రీడాకారులు తమ ఆధార్ కార్డు, జనన ధృవీకరణ పత్రం, పాస్‌పోర్ట్ సైజు ఫోటోలు, గతంలో పాల్గొన్న పోటీల సర్టిఫికెట్లు (ఉన్నట్లయితే) వెంట తీసుకురావాలని కోరారు. క్రీడాకారులు ఉదయం 9.30 గంటలకే వేదికకు చేరుకుని తమ పేర్లను నమోదు చేసుకోవాలని సూచించారు. జిల్లాలో ఉషు క్రీడాభివృద్ధి, ప్రతిభావంతులైన క్రీడాకారులను గుర్తించి ప్రోత్సహించడమే ఈ జిల్లా సెలక్షన్స్ ప్రధాన ఉద్దేశ్యమనినిర్వాహకులు తెలిపారు. జిల్లాలోని అన్ని ఉషు శిక్షణ కేంద్రాల కోచ్‌లు, క్రీడాకారులు మరియు తల్లిదండ్రులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని విజ్ఞప్తి చేశారు. పూర్తి వివరాలకు చంద్రశేఖర్ 9010861207, వెంకట నారాయణ 9848499330 నెంబర్లను సంప్రదించాలన్నారు.

## కరేడు, బట్టి సోమయ్యపాలెం గ్రామాలలో తల్లిపాల వారోత్సవ కార్యక్రమం







(షణ్ముఖ వెలుగు, ఉలవపాడు, ఆగస్టు 5)
తల్లిపాల వారోత్సవాల సందర్భంలో భాగంగా బుధవారం కరేడు 1, బట్టి సోమయ్యపాలెం అంగన్వాడీ కేంద్రాల్లో కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో భాగంగా సిడిపిఓ ఆదేశాల మేరకు జరపటమైనది. తల్లిపాల ప్రాముఖ్యత, తల్లిపాలలో ఉండే ఔషధ గుణాలు గురించి వివరించారు. 6 నెలల వరకు కేవలం తల్లిపాలు ఇవ్వాలి. అట్లానే వాళ్ళు ఎటువంటి పరిస్థితుల్లో అయినా సరే ఉద్యోగానికి వెళ్లే వాళ్ళైనా సరే బిడ్డలకి తల్లిపాలు తాపించవచ్చు. సుస్థిరమైన జీవితానికి తల్లిపాల సంతృప్తిని ప్రోత్సహిద్దాం. అదే దిశగా ఫలితాలు ఇచ్చుచున్న కార్యక్రమాల్ని మరింత బరోపేతం చేయడంలో భాగంగా ఈ వారోత్సవాన్ని నిర్వహించారు. ఈ తల్లిపాల వల్ల ప్రయోజనాలలో ముఖ్యంగా శిశువుకి రోగనిరోధక శక్తి పెంపుగా ఉంటది. మెదడు ఎదుగుదల, జీర్ణక్రియ మెరుగుగా ఉంటుంది. గర్భసంచి, గర్భకోశం క్యాన్సర్లు కూడా రాకుండా చేస్తుంది. కుటుంబానికి ఆరోగ్యవంతమైన శిశువు తర్వాత సమయము కూడా ఆదా చేయవచ్చు. సంతోషకరమైన కుటుంబాన్ని మనం అలవర్చుకోవచ్చు. సమాజానికి ప్రయోజనాలకు వచ్చేసరికి ఆరోగ్యకరమైన సమాజం ఏర్పడుతుంది. జాతీయ అభివృద్ధి దోహదం, సుస్థిర భవిష్యత్తుని మనం ఈ తల్లిపాల ద్వారా సాధించుకోవచ్చని తల్లులకి తెలియజేయడమైనది. ఈ ముఖ్యమైన అంశాలు మొత్తం సిడిపిఓ ఆదేశాల మేరకు కరేడు సూపర్వైజర్ ఎం నాగలక్ష్మి ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించడం జరిగింది. అంతే కాకుండా గర్భవతులకు శ్రీమంతాలు కూడా చేయడం జరిగింది. తల్లిపాల ప్రాముఖ్యత ముందు గర్భవతి దగ్గర నుంచి ఆ తల్లికి తల్లిపాల గురించి వివరించి, తల్లిపాల గురించి, వెయ్యి రోజుల ప్రాముఖ్యత గురించి కూడా చక్కగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి తల్లులు, గర్భవతులు, బాలింతలు, అంగన్వాడీ కార్యకర్తలు, ఏఎన్ఎం లు అందరూ పాల్గొన్నారు.

## ఉప్పుటూరు వైద్యశాలకు వచ్చే రోగులకు ఆధార్, ఫోన్ నంబర్ తప్పనిసరి

(షణ్ముఖ వెలుగు, పర్చూరు, ఆగస్టు 5)



కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల ఆదేశాల మేరకు బాపట్ల జిల్లాలోని ఉప్పుటూరు ప్రభుత్వ హోమియో వైద్యశాలలో 'ఆయుష్ హెల్త్ మేనేజ్‌మెంట్ ఇన్ఫర్మేషన్ సిస్టమ్' ద్వారా రోగుల వివరాలను ఆన్‌లైన్ చేస్తున్నట్లు బుధవారం ఉదయం ఉప్పుటూరు ప్రభుత్వ హోమియో వైద్యులు , జిల్లా ఆయుష్ ఆటిజం సెల్ నోడల్ అధికారి డాక్టర్ దాసరి చంద్రశేఖర్ అన్నారు. దీనికి సంబంధించి ఆసుపత్రి ప్రాంగణంలో రోగులకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్ దాసరి చంద్రశేఖర్ మాట్లాడుతూ ఆన్లైన్లో వివరాలు నమోదు చేయడం కోసం చికిత్సకు వైద్యశాలకు వచ్చే ప్రతి ఒక్కరూ తమ ఆధార్ కార్డు, దానికి అనుసంధానమైన (లింక్ అయిన) మొబైల్ ఫోన్‌ను ఖచ్చితంగా తీసుకురావాలని, ఆధార్‌తో అనుసంధానమైన ఫోన్‌కు వచ్చే ఓటీపీని వైద్యశాలలో నమోదు చేయడం ద్వారానే రోగి ఆరోగ్య సమాచారాన్ని భద్రపరచడం సాధ్యమవుతుందని, కావున ఓటీపీ చెప్పడానికి రోగులు ఎటువంటి సంకోచం పడాల్సిన అవసరం లేదని, మన ప్రధానమంత్రి శ్రీ నరేంద్ర మోదీ శ్రీకారం చుట్టిన ఈ విధానం ద్వారా డిజిటల్ రూపంలో భద్రపరిచిన రోగి ఆరోగ్య వివరాలను, భవిష్యత్తులో దేశంలో ఏ ఆసుపత్రికి వెళ్లినా అక్కడ ఉన్న డాక్టర్లు ఆన్‌లైన్‌లో చూసి మెరుగైన చికిత్స అందించడానికి వీలవుతుందని, అలాగే వ్యాధులు వచ్చిన తర్వాత ఆసుపత్రుల చుట్టూ తిరుగుతూ గంటల తరబడి వేచి ఉండటం కంటే, ముందు జాగ్రత్త చర్యలు పాటించడం ఎంతో మేలని, ఈ నేపధ్యంలోనే ఉప్పుటూరు హోమియో వైద్యశాల ఆధ్వర్యంలో పలుచోట్ల ఆరోగ్య అవగాహన సదస్సులను నిర్వహిస్తున్నానని, కావున ప్రజలందరూ ఈ ఆరోగ్య అవగాహన సదస్సులను మరియు ఉచిత వైద్య శిబిరాలను సద్వినియోగం చేసుకొని సంపూర్ణ ఆరోగ్యవంతులుగా మారాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఆసుపత్రి స్వచ్ఛంద సేవకురాలు కే. నాగరాజా, వైద్యశాలకు వచ్చిన రోగులు మరియు గ్రామస్తులు పాల్గొన్నారు.

## ఎమ్మెల్యే ఏలూరి కృషితో ముగ్గురికి సీఎంఆర్ఎఫ్ ఎల్ఓసీలు రూ.3.33 లక్షల విలువైన ఎల్ఓసీలు అందజేత



(షణ్ముఖ వెలుగు, పర్చూరు, ఆగస్టు 5)
అనారోగ్యంతో బాధపడుతున్న ముగ్గురికి ముఖ్యమంత్రి సహాయనిధి (సీఎంఆర్ఎఫ్) నుంచి రూ.3.33 లక్షల విలువైన ఎల్‌ఓసీలు మంజూరయ్యాయి. పర్చూరు ఎమ్మెల్యే ఏలూరి సాంబశివరావు ప్రత్యేక చొరవతో వీటిని మంజూరు చేయించారు. మార్టూరు మండలం చింతగంపల గ్రామానికి చెందిన రావూరి వాయుపుత్ర చికిత్సకు చీరాలలోని మణిక్యమ్మ మల్టీ స్పెషాలిటీ ఆసుపత్రికి రూ.49,319, ల చెక్కును అందజేశారు. మార్టూరు మండలం తాటివారిపాలెం గ్రామానికి చెందిన కొడవండ్ల వీరబ్రహ్మం చికిత్సకు గుంటూరులోని ఆర్‌కే మల్టీ స్పెషాలిటీ ఆసుపత్రికి రూ.1,27,465, చెక్కును అందజేశారు. మార్టూరు మండలం ద్రోణాదుల గ్రామానికి చెందిన పల్లెపోగు మేరిమ్మ చికిత్సకు గుంటూరులోని శ్రీనివాస న్యూరో సెంటర్‌కు రూ.1,57,145 మంజూరు చేస్తూ సీఎంఆర్‌ఎఫ్ నుంచి ఎల్‌ఓసీని నాయకులు అందజేశారు. ఎమ్మెల్యే ఏలూరి సాంబశివరావు ఆదేశాల మేరకు ఆయా గ్రామాల నాయకులు ఎల్‌ఓసీ పత్రాలను బాధిత కుటుంబ సభ్యులకు అందజేశారు. తమకు ఆపద సమయంలో అండగా నిలిచి వైద్య చికిత్సకు ఆర్థిక సాయం అందేలా కృషి చేసిన ఎమ్మెల్యే ఏలూరికి బాధిత కుటుంబ సభ్యులు కృతజ్ఞతలు తెలిపారు.

## డంపింగ్ యార్డును పరిశీలించిన నగర పంచాయతీ కమిషనర్ రామ్మోహన్‌రావు




(షణ్ముఖ వెలుగు, పొదిలి, ఆగస్టు 5)
పొదిలి నగర పంచాయతీ పరిధిలోని చెత్తను వేసే డంపింగ్ స్థలాన్ని బుధవారం ఉదయం నగర పంచాయతీ కమిషనర్ రామ్మోహన్ రావు ఆకస్మికంగా పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన యార్డులో చెత్త నిర్మూలన మరియు ప్రాసెసింగ్ జరుగుతున్న తీరును క్షేత్రస్థాయిలో తనిఖీ చేశారు. నగర పంచాయతీ పరిధిలోని వివిధ వార్డుల నుండి సేకరిస్తున్న తడి, పొడి చెత్తను వేరుచేసే విధానాన్ని, యార్డు నిర్వహణను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా కమిషనర్ రామ్మోహన్ రావు మాట్లాడుతూ పట్టణంలో పరిశుభ్రతకు ప్రాధాన్యమిస్తూ, సేకరించిన వ్యర్థాలను ఎప్పటికప్పుడు శాస్త్రీయంగా నిర్మూలించాలని, డంపింగ్ యార్డు వల్ల సమీప ప్రజలకు, ప్రయాణికులకు ఎలాంటి దుర్వాసన లేదా ఆరోగ్య సమస్యలు తలెత్తకుండా తగిన జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో నగర పంచాయతీ పారిశుధ్య అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

## గ్రామ పంచాయతీ అభివృద్ధి ప్రణాళిక పై శిక్షణ




(షణ్ముఖ వెలుగు, పొదిలి, ఆగస్టు 5)
పొదిలి మండల పరిషత్ కార్యాలయ ప్రాంగణంలో గ్రామ పంచాయతీ అభివృద్ధి ప్రణాళిక పై ఒకరోజు అవగాహన శిక్షణా కార్యక్రమం నిర్వహించారు. ఈ శిక్షణా కార్యక్రమంలో మండల పరిధిలోని వివిధ గ్రామాల పంచాయతీ కార్యదర్శులు, ఇంజనీరింగ్ అసిస్టెంట్లు, డిజిటల్ అసిస్టెంట్లు పాల్గొన్నారు. గ్రామ స్థాయి ప్రాధాన్యతలను గుర్తించి, నిధుల వినియోగం మరియు గ్రామాల సమగ్ర పురోగతికి అనుగుణంగా అభివృద్ధి ప్రణాళికలను ఎలా తయారు చేసుకోవాలో నిపుణులు వివరించారు. పలు రకాల స్థానిక అభివృద్ధి అంశాలపై సిబ్బందికి విస్తృత శిక్షణ ఇచ్చారు. ఈ కార్యక్రమానికి డివిజనల్ డెవలప్‌మెంట్ ఆఫీసర్ డాక్టర్ పి. సుజాత ముఖ్య అతిథిగా హాజరై ప్రసంగించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ గ్రామ పంచాయతీల స్వయం సమృద్ధి, పారదర్శక పాలనే లక్ష్యంగా ఈ ప్రణాళికలు రూపొందించాలని సూచిస్తూ, శిక్షణ పట్ల సిబ్బందికి పూర్తి అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఎంపీడీఓ జి శోభన్‌బాబు, ఎంఎస్జీఓ షేక్ చాంద్ బి, సచివాలయ సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

# అతి తక్కువ ఫీజుతో "జర్నలిజం లో డిప్లొమా కోర్సు"



**(షణ్ముఖ వెలుగు, విజయవాడ, ఆగస్టు5)**

అతి తక్కువ ఫీజుతో "జర్నలిజం లో డిప్లొమా కోర్సు" చేసే మంచి అవకాశాన్ని సిఆర్ మీడియా అకాడమీ అందిస్తోందని ఛైర్మన్ ఆలపాటి సురేశ్ కుమార్ ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఈ కోర్సు ప్రత్యేకంగా వర్కింగ్ జర్నలిస్టుల కోసం ఉద్దేశించినదైనా, జర్నలిజం వృత్తిలో అభిరుచి కలిగిన డిగ్రీ ఉత్తీర్ణులైన సాధారణ అభ్యర్థులు కూడా ఈ డిప్లమా కోర్సుకు దరఖాస్తు చేసుకోవడానికి అర్హులని ఆ ప్రకటలో ఆయన తెలిపారు. జర్నలిజంలో ఉన్నత ప్రమాణాలు నెలకొల్పే లక్ష్యాలకు అనుగుణంగా ఈ కోర్సును రూపొందించామన్నారు. జర్నలిస్టులకు వృత్తిపరమైన విద్యార్హత ఉంటే మరింత మెరుగైన ఫలితాలు సాధించవచ్చన్నారు. ఆంధ్రా యూనివర్సిటీ జర్నలిజం, మాస్ కమ్యూనికేషన్స్ ప్రొఫెసర్, ప్రస్తుత ఒంగోలు ఆంధ్రకేసరి యూనివర్సిటీ వైస్ ఛాన్సలర్ అయిన ప్రొఫెసర్ డివిఆర్ మూర్తి ఆధ్వర్యంలోని వివిధ యూనివర్సిటీల జర్నలిజం డిపార్టుమెంట్ ప్రొఫెసర్లతో కూడిన "బోర్డు ఆఫ్ స్టడీస్" ఈ డిప్లొమా కోర్సును రూపొందించిందని ఆయన తెలిపారు. ఎలెక్ట్రానిక్, సోషల్ మీడియాల న్యూస్ చానెళ్లకు, పత్రికలకు ఉన్నత ప్రమాణాలతో పనిచేయ గలిగిన సామర్థ్యం ఈ కోర్సును నేర్చుకోవచ్చున్నారు. ఆంధ్రా యూనివర్సిటీ జర్నలిజం, మాస్ కమ్యూనికేషన్స్ విభాగం రిటైర్డ్ హెడ్ ఆఫ్ ది డిపార్టుమెంటు ప్రొఫెసర్ పి బాబీ వర్ధన్ కోర్సు డైరెక్టర్‌గా వ్యవహరిస్తారన్నారు. అదే విధంగా ఆచార్య నాగార్జున యూనివర్సిటీ జర్నలిజం, మాస్ కమ్యూనికేషన్స్ విభాగం హెడ్ ఆఫ్ ది డిపార్టుమెంటు ప్రొఫెసర్ కె జోతిర్మయి యూనివర్సిటీ తరపున కోఆర్డినేటర్‌గా వ్యవహరిస్తారన్నారు.

ఈ కోర్సు కాల వ్యవధి 6 నెలలని ఆయన తెలిపారు. ఎంపిక చేసిన రిటైర్డ్ అధ్యాపకులు, సీనియర్ జర్నలిస్టులు చే క్లాసులు నిర్వహిస్తామన్నారు. ప్రతి రోజు సోమవారం నుంచి శుక్రవారం వరకు ఉదయం గం.8 నుంచి 9 వరకు, 9 నుంచి 10 గంటల వరకు రెండు క్లాసులు జరుగుతాయన్నారు. ఆన్ లైన్ (కరెస్పాండెన్సు) విధానంలో ఈ క్లాసులు నిర్వహిస్తామన్నారు. కోర్సు పూర్తి అవుతున్న సమయంలో ప్రతి అభ్యర్థి కోర్సు డైరక్టర్ ఆధ్వర్యంలో అస్సైన్ మెంట్స్ రాయాల్సి ఉంటుందని తెలిపారు. పరీక్షల్లో అభ్యర్థులు పొందిన మార్కులకు అస్సైన్మెంట్ మార్కులు కలిపి తుది ఫలితాలను ఆచార్య నాగార్జున యూనివర్సిటీ వెల్లడిస్తుందన్నారు. ఉత్తీర్ణత సాధించిన అభ్యర్థులకు నాగార్జున యూనివర్సిటీ డిప్లొమా సర్టిఫికెట్ జారీ చేస్తుందన్నారు. ఇందుకోసం మీడియా అకాడమీ, ఆచార్య నాగార్జున యూనివర్సిటీలు ఒక ఒప్పందం కుదుర్చుకున్నాయన్నారు. వర్కింగ్ జర్నలిస్టులు డౌన్ లోడ్ చేసుకున్న దరఖాస్తులో తమ వివరాలు నింపి ఇంటర్ మీడియట్ సర్టిఫికెట్, అక్రిడిటేషన్ కార్డు లేదా ఐడి కార్డు లేదా సర్వీసు ధ్రువీకరణ పత్రం 1 జెరాక్స్ కాపీలను సెక్రెటరీ, సిఆర్ మీడియా అకాడమీ పేరున తీసిన రూ.2000 డిమాండ్ డ్రాఫ్ట్ ను జతపరచి అప్లికేషనలను పంపుకోవాలని ఆయన సూచించారు. జర్నలిజం పై అభిరుచి కలిగిన ఇతర అభ్యర్థులు దరఖాస్తుతో డిగ్రీ సర్టిఫికేట్, సెక్రెటరీ సిఆర్ మీడియా అకాడమీ పేరున తీసిన రూ.2500 డిమాండ్ డ్రాఫ్ట్ ను జతపరచి పంపుకోవాలని సూచించారు. దరఖాస్తు చేసుకునేందుకు అభ్యర్థులు వెబ్‌సైట్ లింక్ ను క్లిక్ చేసి దరఖాస్తును డౌన్ లోడ్ చేసుకోవాలన్నారు. ఇతర వివరాలు కూడా ఈ లింక్‌లో పొందుపరచామన్నారు. దరఖాస్తులను దిగువ చిరునామాకు పంపుకోవాల్సిందిగా ఆయన పేర్కొన్నారు. సెక్రెటరీ, ఆంధ్ర ప్రదేశ్ సిఆర్ మీడియా అకాడమీ, 40-6/4-8, 4 వ అంతస్తు, రెవెన్యూ కాలనీ, మొగల్రాజపురం, విజయవాడ. 520010. దరఖాస్తులు పంపేందుకు చివరి తేదీ ఆగస్టు 20వ తేదీ అని ఆయన తెలిపారు. సెప్టెంబర్ మొదటివారం నుంచి క్లాసులు ప్రారంభమవుతాయన్నారు.

# ఎస్సీ కార్పొరేషన్‌కు నిధులు కేటాయించాలి-సుజన్ మాదిగ



**(షణ్ముఖ వెలుగు, ఒంగోలు, ఆగస్టు 5)**

కూటమి ప్రభుత్వం వచ్చి రెండు సంవత్సరాలు దాటుతున్నప్పటికీ, ఈరోజు వరకు రాష్ట్రంలో ఉన్న ఎస్సీల విషయంలో నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్న కూటమి ప్రభుత్వ, నిర్ణయం సరికాదని, తక్షణమే రాష్ట్రంలో ఉన్న ఎస్సీ కార్పొరేషన్‌కు నిధులు కేటాయించాలని సుజన్ మాదిగ డిమాండ్ చేశారు. బుధవారం ఆయన కార్యాలయంలో మాట్లాడుతూ ప్రభుత్వం వచ్చి రెండు సంవత్సరాల దాడుతున్నప్పటికీ, ఈరోజు వరకు ఎస్సీలను ఆర్థికంగా అనగా తొక్కుతున్న, ఎదగనీయకుండా చూస్తున్న కూటమిపాలన సరికాదని ఆయన అన్నారు. అదేవిధంగా వైసీపీ ప్రభుత్వంలో ఎస్సీలకు ఏమీ న్యాయం జరగలేదని మరియు ఎస్సీ కార్పొరేషన్‌ను నిర్వీర్యం చేశారని, ఎస్సీలకు రావలసిన 27 స్కీంలు ఎత్తివేసారని, అనేక సార్లు అనేక సమావేశాలలో మాట్లాడిన చంద్రబాబు నాయుడు, లోకేష్‌లు ఈ ప్రభుత్వం వచ్చి రెండు సంవత్సరాలు దాటితున్నప్పటికీ, వారు మౌనవహించడం, ధమన నీతికి నిదర్శనం అని ఆయన అన్నారు. అదేవిధంగా రాష్ట్రంలో దళితులపై దాడులు, హత్యలు, అత్యాచారాలు పెరిగిపోయాయని, కేవలం మాల, మాదిగల పై ఇలాంటి దాడులు వైసీపీ ప్రభుత్వంలో కంటే ఎక్కువయ్యాయని, ఓట్లు వేసిన మాల, మాదిగలపై కక్ష సాధింపు సరైన చర్య కాదని ఆయన దుయ్యపట్టారు. ఈ కార్యక్రమంలో మహాజన సోషలిస్ట్ పార్టీ రాష్ట్ర నాయకులు పాలడుగు రమేష్ మాల, మాదిగ సంక్షేమ పోరాట సమితి బాపట్ల జిల్లా అధ్యక్షులు తేళ్ళ జయరాజు మాదిగ, మాదిగ సంక్షేమ పోరాట సమితి జిల్లా నాయకులు సింగయ్య మాదిగ, తేజ మాదిగ, తిమోతి మాదిగ, తదితరులు పాల్గొన్నారు.

# ఈఎల్ఎస్ఆర్ ట్యాంక్‌ను పరిశీలించిన డీఈ, ఈఈ

**(షణ్ముఖ వెలుగు, ఒంగోలు, ఆగస్టు 5)**



ఒంగోలు నగరపాలక సంస్థ కమీషనర్ టి వెంకట కృష్ణయ్య బుధవారం రాంనగర్ 8వ లైన్‌లోని మంచి నీటి ఈఎల్ఎస్ఆర్ ట్యాంక్ ను డీఈ, ఈఈతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా కమీషనర్




వెంకట కృష్ణయ్య మాట్లాడుతూ ఒంగోలు నగరంలో ఉన్న అన్ని మంచి నీటి ఈఎల్ఎస్ఆర్ ట్యాంకులను నెలకు 2 సార్లు తప్పనిసరిగా శుభ్రం చేయాలి అని ఇంజనీరింగ్ అధికారాలకు ఆదేశాలు జారి చేశారు. అలానే ఆయా మంచినీటి ఈఎల్ఎస్ఆర్ ట్యాంకులను శుభ్రం చేయనప్పుడు టైం స్టాంప్ తో ఉన్న ఫోటోలను తీసి వాటిని ప్రతి నెల సబ్మిట్ చేయవలసిందిగా ఆదేశాలు జారీ చేశారు. అలానే ట్యాంక్లను ఎప్పుడు శుభ్రం చేసారో అని అక్కడ బోర్డు మీద రాయవలసిందిగా ఇంజనీరింగ్ సిబ్బందికి సూచించారు. అలానే మంచి నీరు సరఫరా చేసినప్పుడు తప్పనిసరిగా ఆర్‌సీ టెస్టులు చేయవలసిందిగా చూడవలసినదిగా అందరూ అసిస్టెంట్ ఇంజనీర్లకు ఆదేశాలున్నాయి చేశారు. అలానే ఈఎల్ఎస్ఆర్ ట్యాంక్ పరిసరాలు కూడా పరిశుభ్రం గా ఉండేలా చర్యలు తీసుకోవాలి అని ఇంజనీరింగ్ సిబ్బందికి, శానిటరీ సిబ్బందికి ఆదేశాలు ఇచ్చారు. ఈ కార్యక్రమంలో ఒంగోలు నగరపాలక సంస్థ కమీషనర్‌తో పాటు, డీఈఈ పద్మజ, ఇంచార్జ్ ఏఈ అనిల్ పాల్గొన్నారు.

# సముద్ర చేపల ఆహారం ప్రపంచ స్థాయి ధృవీకరణ పై మాగుంట ప్రశ్న

**(షణ్ముఖ వెలుగు, ఒంగోలు, ఆగస్టు 5)**

దేశం,ఆంధ్రప్రదేశ్ లో సముద్ర చేపల ఆహారంపై ప్రపంచ స్థాయి ధృవీకరణ పొందుటకై పి యం మత్య సంపద యోజన పథకం క్రింద మంజూరు చేసిన నిధులు, నిధులు పొందిన చేపల పెంపక కేంద్రాలు, పరిశ్రమలు, పరిశ్రమ అంచనా ఖర్చు గురించి ప్రస్తుత పార్లమెంటు సమావేశాలలో ఒంగోలు ఎంపి మాగుంట శ్రీనివాసులురెడ్డి ప్రశ్నించారు. ఆయన అడిగిన ప్రశ్నకు కేంద్ర మత్య, పశు సంవర్ధక, పాడిపరిశ్రమశాఖ మంత్రి, రాజీవ్ రంజన్ సింగ్ అలియాస్ లలన్ సింగ్ సమాధానమిస్తూ దేశం, ఆంధ్రప్రదేశ్‌లో పియం మత్స్య సంపద యోజన పథకాన్ని కేంద్ర మత్స్యశాఖ 2020-21 నుండి అమలుచేయుచున్నదని, సముద్ర చేపల ఆహారం పై ప్రపంచ స్థాయి ధృవీకరణ పొందుటకై ప్రపంచ స్థాయి ధృవపత్రాలను పొందుటకు ఈ పథకం మద్దతు ఇవ్వడంతోపాటు, సమాచార సాంకేతిక వ్యవస్థల ద్వారా సమగ్ర సామర్థ్యం గుర్తింపు చేస్తుందని తెలిపారు. ఈ పథకం క్రింద చేప పిల్లలు పొదిగే కేంద్రాలకు, లోతట్టు చేపల పెంపకానికి, చేపల మేత మిల్లుల ఏర్పాటుకు ఆంధ్రప్రదేశ్, తమిళనాడు, కర్నాటక, గుజరాత్, అస్సాం, చత్తీస్ ఘర్ రాష్ట్రాలకు మంజూరుచేసిన మొత్తం నిధులు రూ.4.50 కోట్లు కాగా, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రానికి రూ.1.68 కోట్లు ఇవ్వబడ్డాయని తెలిపారు. దేశంలో చేపల నిల్వల అంచనా, వనరుల పర్యవేక్షణ, శాస్త్రీయ ఆధారాన్ని సమకూర్చడం, ధృవీకరణ కార్యక్రమాలు మొదలగు వాటిని "ది ఫిషరీ సర్వే అఫ్ ఇండియా" "సెంట్రల్ మెరైన్ ఫిషరీస్ రీసెర్చ్ ఇన్స్టిట్యూట్" చేపట్టునని తెలిపారు. సముద్ర చేపల ఆహారం పై ప్రపంచ స్థాయి ధృవీకరణ పత్రాలను ఇప్పటికే పలు సంస్థలు పొందగా, దేశంలో వీటిని పొందే చర్యలు అంతకంతకూ పెరుగుచున్నాయని కేంద్ర మంత్రి తెలియజేశారు.

# మధ్యవర్తిత్వం పై అవగాహన కార్యక్రమం

**(షణ్ముఖ వెలుగు, ఒంగోలు, ఆగస్టు 5)**

జిల్లా న్యాయ సేవాధికార సంస్థ, ఒంగోలు ఆధ్వర్యంలో బుధవారం జిల్లా కోర్టు ప్రాంగణంలో మీడియేషన్ ఫర్ నేషన్ 3.0 (మధ్యవర్తిత్వం) పై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ప్రధాన జిల్లా న్యాయమూర్తి, చైర్మన్, జిల్లా న్యాయ సేవాధికార సంస్థ, ఒంగోలు ఎ సత్యానంద్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎ సత్యానంద్ మాట్లాడుతూ ఆగస్టు ఒకటో తేదీ నుండి ఏడో తేదీ వరకు ఇటువంటి కార్యక్రమాలు వివిధ రూపాల్లో ప్రజలకు చేరువు చేయటం ద్వారా వివాదాలను పరస్పర అంగీకారంతో, స్నేహపూర్వక వాతావరణంలో త్వరితగతిన పరిష్కరించుకోవడానికి మధ్యవర్తిత్వం ఎంతో ఉపయోగకరమైన విధానమని తెలిపారు. మధ్యవర్తిత్వం ద్వారా సమయం, ఖర్చు ఆదా కావడంతో పాటు ఇరుపక్షాల మధ్య సహృద్భావ సంబంధాలను కొనసాగించవచ్చని పేర్కొన్నారు. అనంతరం 1 కె రన్ కార్యక్రమాన్ని జిల్లా కోర్టు ప్రాంగణం నుంచి ఒంగోలు చర్చ్ సెంటర్ వరకు నిర్వహించారు. ఈ రన్ ద్వారా ప్రజల్లో మధ్యవర్తిత్వం పై అవగాహన కల్పించడంతో పాటు ఐక్యత, సామాజిక బాధ్యత, న్యాయ అవగాహనను పెంపొందించేందుకు సందేశాన్ని అందించారు. ఈ కార్యక్రమంలో అదనపు జిల్లా న్యాయమూర్తులు టి రాజ్యలక్ష్మి, పి లలిత, పూర్ణిమ, కె శ్యామ్ బాబు, శైలజ, డి దీనా, సీనియర్ సివిల్ జడ్జీలు వి పల్లవి, వి రామకృష్ణ, జూనియర్ సివిల్ జడ్జీలు, మధ్యవర్తిత్వ న్యాయవాదులు, ఇతర న్యాయవాదులు, కోర్టు సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.









# లక్ష్మి సూపర్ స్పెషాలిటీ హాస్పిటల్‌లో మెదడులోని నరాలకు అరుదైన చికిత్స

### కుట్లు, కోత లేకుండా విజయవంతంగా చికిత్స నిర్వహించిన హాస్పిటల్ వైద్యులు

### మీడియా సమావేశంలో లక్ష్మీ సూపర్ స్పెషాలిటీ హాస్పిటల్ అధినేత డాక్టర్ అబ్బూరి రవీంద్ర వెల్లడి




**(షణ్ముఖ వెలుగు, ఒంగోలు, ఆగస్టు 5)**

కేవలం మెట్రో నగరాలకే పరిమితమైన మెదడు నరాల ఇంట్రాక్రెనికల్ ఎన్యూరిజం కాయిలింగ్ పద్ధతిలో శస్త్ర చికిత్సలు ఇప్పుడు ఒంగోలులోని రిమ్స్ హాస్పిటల్ ఎదురు లక్ష్మీ సూపర్ స్పెషాలిటీ హాస్పిటల్లో కూడా నిర్వహిస్తున్నట్లు హాస్పిటల్ అధినేత డాక్టర్ రవీంద్ర అబ్బూరి పేర్కొన్నారు. స్థానిక హాస్పిటల్ ఆవరణంలో బుధవారం నిర్వహించిన మీడియా సమావేశంలో డాక్టర్ అబ్బూరి రవీంద్ర మాట్లాడుతూ అతి తక్కువ ఖర్చుతో మెట్రో సిటీల స్థాయి వైద్య సేవలు లక్ష్మీ సూపర్ స్పెషాలిటీ హాస్పిటల్ వైద్యశాలలో అందిస్తున్నట్లు వివరించారు. నాలుగు రోజుల క్రితం 55 సంవత్సరాల ఉన్న మహిళ తీవ్రమైన తలనొప్పి, వాంతులతో హాస్పిటల్ కు వచ్చిందన్నారు. ఆమెకు సిటి స్కాన్ తీయగా మెదడులోని సున్నితమైన నరాల వద్ద మూడు చోట్ల బెలూన్ లాగా ఉబ్బి ఉన్నాయన్నారు. తలనొప్పి ఎక్కువైనా, బీపీ ఎక్కువ అయిన అవి వెంటనే పేలిపోయి మెదడుకు సంబంధించిన పలు రోగాలు వచ్చే అవకాశం ఉందన్నారు. దీనిని గుర్తించిన హాస్పిటల్ వైద్యులు వెంటనే మత్తు వైద్యులు డాక్టర్ శ్రీవాణి సహకారంతో ఇంట్రాక్రెనికల్ ఎన్యురిజం కాయిలింగ్ పద్ధతిలో రెండు ఇంట్రా క్రెనియల్ ఎన్యురిజమ్స్ బ్లాక్ చేయడం జరిగిందన్నారు. దీంతో రోగి కేవలం రెండు రోజుల్లోనే డిశ్చార్జ్ అయ్యే అవకాశం ఉందని తెలిపారు. అయితే గతంలో ఈ చికిత్సను ఓపెన్ బ్రెయిన్ సర్జరీ ద్వారా బెలూన్లను బ్లాక్ చేయడం జరుగుతుందన్నారు. ఈ ప్రక్రియ వల్ల రోగికి పక్షవాతం వంటి ఇతర రోగాలు కూడా వచ్చే అవకాశం ఉందని తెలిపారు. అయితే నూతన టెక్నాలజీ ద్వారా నిర్వహించిన ఈ వైద్య ప్రక్రియ కారణంగా ఎటువంటి సైడ్ ఎఫెక్టులు లేకుండా రోగి వెంటనే డిశ్చార్జ్ అయ్యే అవకాశం ఉందన్నారు. ఇంటర్నేషనల్ రేడియాలజిస్ట్ డాక్టర్ తేజ మాట్లాడుతూ రోగికి ఎమ్మారై స్కాన్ చేసి ఎడమవైపు రక్తనాళాలు ఉబ్బి, కంటికి కూడా దీని ఎఫెక్ట్ పడినట్లు గుర్తించామన్నారు. కొద్ది రోజులలో రోగికి కంటి సమస్య కూడా పోయే అవకాశం ఉందని పేర్కొన్నారు. మెట్రో సిటీలలో రూ.20 లక్షలు ఖర్చు అయ్యే ఈ వైద్యానికి కేవలం ప్రభుత్వం అందించిన ముఖ్యమంత్రి సహాయ నిధి ద్వారా వచ్చిన రూ.4 లక్షలకే వైద్య సేవలు అందించామని ఈ సందర్భంగా పేర్కొన్నారు. ఈ సమావేశంలో డాక్టర్ శ్రీకాంత్, హాస్పిటల్ ఏవో శ్రీనివాస్, తదితరులు పాల్గొన్నారు.




# ఫార్మర్ యాప్‌తో ప్రభుత్వ సేవలు సులభం

**(షణ్ముఖ వెలుగు, బల్లికురవ, ఆగస్టు 5)**



రైతులు ప్రభుత్వ వ్యవసాయ సేవలను సులభంగా పొందేందుకు ఫార్మర్ యాప్‌ను తప్పనిసరిగా వినియోగించాలని మండల వ్యవసాయాధికారి పి. శ్రీనివాసరావు సూచించారు. "పొలం పిలుస్తుంది" కార్యక్రమంలో భాగంగా బుధవారం వైదన, కొమ్మినేనివారిపాలెం గ్రామాల్లో నిర్వహించిన గ్రామసభల్లో ఆయన మాట్లాడారు. ఫార్మర్ యాప్ ద్వారా భూ వివరాలు, ఈ-క్రాప్ నమోదు, రైతు రిజిస్ట్రేషన్, పంట బీమా, సబ్సిడీ పథకాల సమాచారం, వాతావరణ హెచ్చరికలు, పంటల సాగు సాంకేతిక సూచనలు, ఎరువులు, విత్తనాల లభ్యత వంటి సేవలను ఒకే వేదికపై పొందవచ్చని వివరించారు. పంట వివరాలను సకాలంలో నమోదు చేసుకుంటే ప్రభుత్వ సంక్షేమ పథకాల ప్రయోజనాలు సులభంగా అందుతాయని తెలిపారు. వ్యవసాయ శాఖ అందిస్తున్న సేవలను సద్వినియోగం చేసుకుని రైతులు అధిక దిగుబడులు, మెరుగైన ఆదాయం సాధించాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో వ్యవసాయ విస్తరణ అధికారి మౌలాలి, వీఏఏలు, ఎంపీటీసీ సభ్యులు, రైతులు పాల్గొన్నారు.

## పుస్తక ప్రదర్శనకు రచయితల నుంచి పుస్తకాలు ఆహ్వానం



(షణ్ముఖ వెలుగు, ఒంగోలు, ఆగస్టు 5)

ఒంగోలు నగరపాలక సంస్థకు త్వరలో నిర్వహించే 150 సంవత్సరాల వేడుకలలో భాగంగా ఒంగోలు రచయితలు ముద్రించిన పుస్తకాలతో ఏర్పాటు చేసే బుక్ ఎగ్జిబిషన్ కు ప్రకాశంజిల్లా రచయితల సంఘం పూర్వాధ్యక్షుడు బి.హనుమారెడ్డి రచించిన గ్రంథాలతో పాటు సంఘం స్వర్ణోత్సవాల సందర్భంగా ముద్రించిన తెలుగు లోగిలి గ్రంథాన్ని మాజీ మున్సిపల్ కమిషనర్, 150 సంవత్సరాల ఉత్సవాల కమిటీ ప్రత్యేక అధికారి సంక్రాంతి వెంకటకృష్ణకు నగరపాలక సంస్థ కార్యాలయంలో ప్రకాశంజిల్లా రచయితల సంఘం అధ్యక్షులు పొన్నూరు వేంకట శ్రీనివాసులు, ప్రధాన కార్యదర్శి యత్తప్ప కొండారెడ్డి అందజేశారు. ఈ కార్యక్రమంలో ప్రముఖ నాటక రచయిత పాటిబండ్ల ఆనందరావు, ఉన్నం జ్యోతివాసు, న్యాయవాదులు సివి రామకృష్ణారావు, అన్నం వెంకటేశ్వర్లు, పిఎన్ మల్లికార్జున్‌రెడ్డి, జి రవీంద్రారెడ్డి తదితరులు పాల్గొన్నారు. ఒంగోలు రచయితలు తాము రచించిన పుస్తకాలను ఎగ్జిబిషన్ లో ప్రదర్శన కోసం ఒంగోలు నగర పాలక సంస్థ మేనేజర్ పి శ్రీహరికి అందజేయవలసిందిగా కోరారు. పూర్తి వివరాలకు 9849907254 ని సంప్రదించవలసినదిగా కోరారు.

## క్విట్ ఇండియా డేని పురస్కరించుకొని ఆగస్టు 10న దేశవ్యాప్తంగా జైల్ భరో కార్యక్రమం



(షణ్ముఖ వెలుగు, ఒంగోలు, ఆగస్టు 5)

జైల్ భరో కార్యక్రమాన్ని నిర్వహించాలనే కేంద్ర కార్మిక సంయుక్త కిసాన్ మోర్చా, వ్యవసాయ, రైతు సంఘాల నిర్ణయం మేరకు బుధవారం ఒంగోలులోని సిఐటియు జిల్లా కార్యాలయంలో ఎస్‌కెఎం జిల్లా కన్వీనర్ చుండూరు రంగారావు అధ్యక్షతన సంయుక్త కిసాన్ మోర్చా కేంద్ర కార్మిక సంఘాలు రైతు వ్యవసాయ కౌలు రైతు సంఘాల నాయకుల సమావేశం జరిగింది. ఈ సమావేశంలో ఈ కింది నిర్ణయాలు చేయడం జరిగింది. కేంద్ర ప్రభుత్వం ఫ్రీ ట్రేడ్ అగ్రిమెంట్ పేరుతో రైతాంగాన్ని వినాశనం వైపు తీసుకెళ్లే విధంగా అంతర్జాతీయ ఒప్పందాలు చేసుకోవడాన్ని తీవ్రంగా వ్యతిరేకించాలని, మహాత్మా గాంధీ గ్రామీణ ఉపాధి హామీ చట్టాన్ని తిరిగి పునరుద్ధరించి మరింత మెరుగైన పద్ధతిలో అమలు చేయాలని, లేబర్ కోడ్ లను రద్దు చేయాలని, కనీస వేతనం 31000 ఇవ్వాలని, స్వామినాథన్ కమిషన్ సిఫారసులు అమలు చేయాలని, ప్రభుత్వ రంగ పరిశ్రమలను ప్రైవేటీకరించరాదని, డిమాండ్ చేస్తూ ఆగస్టు 10న జిల్లా కేంద్రం ఒంగోలు, కందుకూరు, అద్దంకి రెవిన్యూ డివిజన్ కేంద్రాల వద్ద సంతనూతలపాడు, కొండేపి నియోజకవర్గ కేంద్రాల వద్దజైల్ భరో కార్యక్రమాన్ని నిర్వహించాలని నిర్ణయించడమైనది. ఈ కార్యక్రమాన్ని జయప్రదం చేయడానికి కరపత్ర ప్రచారం, జనరల్ బాడీలు విస్తృతంగా నిర్వహించాలని నిర్ణయించడమైనది. ఈ సమావేశంలో సిఐటియు జిల్లా అధ్యక్ష కార్యదర్శులు కాలం సుబ్బారావు, ఎం రమేష్, ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం ప్రకాశం జిల్లా కమిటీ అధ్యక్ష, కార్యదర్శులు పమిడి వెంకట్రావు, జుజ్జురి జయంతిబాబు, సహాయ కార్యదర్శులు టి శ్రీకాంత్, బెజవాడ శ్రీను, ఆంధ్రప్రదేశ్ వ్యవసాయ కార్మిక సంఘం ప్రకాశం జిల్లా కమిటీ అధ్యక్షుడు నెరుసుల వెంకటేశ్వర్లు, జిల్లా వ్యవసాయ కార్మిక సంఘం నాయకులు దాసరి అంజయ్య, ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం రాష్ట్ర సమితి నాయకులు వి హనుమారెడ్డి, ఏఐటియుసి జిల్లా అధ్యక్షుడు టంగుటూరి ప్రభాకర్, కౌలు రైతు సంఘం జిల్లా కార్యదర్శి వ బాలకోటయ్య, ఐఎఫ్టియు రాష్ట్ర నాయకులు ఆర్ మోహన్, ఏఐఎఫ్టియు రాష్ట్ర నాయకులు ఎంఎస్ సాయి, రైతుకులి సంఘం జిల్లా నాయకులు పరిటాల కోటేశ్వరరావు, రైతు సంఘం నాయకులు వాసు, తదితరులు పాల్గొన్నారు.

## నిరుపేద మహిళలకు తోపుడు బండి అందజేసిన టిడిపి నాయకులు



(షణ్ముఖ వెలుగు, ఒంగోలు, ఆగస్టు 5)

30వ డివిజన్ అధ్యక్షులు నత్తల కనకారావు ఆధ్వర్యంలో డివిజన్‌కు చెందిన నిరుపేద మహిళ పప్పుల సుమతికి ఉపాధి కల్పించే ఉద్దేశంతో తోపుడు బండిని అందజేశారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ, పేద కుటుంబాల ఆర్థికాభివృద్ధికి తోడ్పడే ఇటువంటి కార్యక్రమాలను నిరంతరం కొనసాగిస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో ప్రధాన కార్యదర్శి కొల్లా బత్తిన రమేష్, ఉపాధ్యక్షులు కాకుమాను రాజేష్, 191వ బూత్ ఇంచార్జ్ కొమ్ము సురేష్, పొంతగంటి సుధీర్ బాబు, మేడికొండ సాయి, కొమ్మూరి రవిచంద్ర, ప్రశాంతి, ధర్మ, హగ్గయ రాజు, పాలపర్తి లక్ష్మీనారాయణ తదితరులు పాల్గొన్నారు.

# లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో విద్యార్థులకు రూ.10 వేల విలువ చేసే స్టీల్ వాటర్ బాటిళ్ల పంపిణీ

## లయన్స్ క్లబ్ అధ్యక్షుడు వెంకట జగన్ బాబు







(షణ్ముఖ వెలుగు, తర్లుపాడు, ఆగస్టు 5)

మండలంలోని మీర్జాపేట గ్రామంలో గల మండల ప్రాథమిక పాఠశాలలోని విద్యార్థినీ విద్యార్థులకు పర్యావరణ ఆరోగ్య పరిరక్షణ కోసం ప్లాస్టిక్ వస్తువులను వాడకం తగ్గించాలన్న రాష్ట్ర ప్రభుత్వ నినాదానికి అనుగుణంగా మార్కాపురం లయన్స్ క్లబ్ వారి ఆధ్వర్యంలో సుమారు 80 మంది విద్యార్థులకు 10 వేల రూపాయల విలువ చేసే స్టీల్ వాటర్ బాటిళ్లను లయన్స్ క్లబ్ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా విచ్చేసిన మండల విద్యాశాఖ అధికారి 2 టి శ్రీనివాసులు, అధ్యక్షుడు వెంకట జగన్ బాబు, క్లబ్ సభ్యుల చేతుల మీదుగా అందజేశారు. ఈ సందర్భంగా లయన్స్ క్లబ్ అధ్యక్షులు జగన్‌బాబు, మండల విద్యాశాఖఅధికారి టి శ్రీనివాసులు సంయుక్తంగా మాట్లాడుతూ లయన్స్ క్లబ్ సేవా సంస్థ స్థాపించి ఇప్పటికీ 108 సంవత్సరాలు అయిందన్నారు. ఈ సంస్థ ప్రపంచంలో అనేక సేవా కార్యక్రమాలను చేపట్టడం జరిగిందన్నారు. ఈ సంస్థలో సుమారు 14 లక్షల మంది సభ్యులు వాలంటీర్లుగా పనిచేస్తున్నారన్నారు. ఈ సంస్థ సమాజానికి ఏదో ఒక సేవా కార్యక్రమాలు చేయాలన్నదే ముఖ్య ఉద్దేశమన్నారు. ప్రస్తుతం వారు చేస్తున్న సేవా కార్యక్రమాలకు బంధుమిత్రుల ఆర్థిక సహాయ సహకారాలు మరువలేనివన్నారు. వారందరికీ ప్రత్యేక కృతజ్ఞతా వందనాలు తెలియజేశారు. సేవా సంస్థలు అందిస్తున్న సహకారాన్ని భవిష్యత్తులో ఎవరు మర్చిపోకూడదన్నారు. వారు అందిస్తున్న ఏ వస్తువులనైనా సద్వినియోగం చేసుకొని విద్యలో అత్యున్నత స్థాయికి రాణించాలన్నారు. అంతే కాక విద్యార్థి దశ నుండే ఇతరు లకు సేవచేసే గుణం, మంచి అలవాట్లు, సేవా తత్పరత నేర్చుకోవాలన్నారు. స్థానిక పాఠశాల కాంప్లెక్స్ చైర్మన్ కె ప్రవీణ్ కుమార్, లయన్స్ క్లబ్ జోనల్ చైర్మన్ టి రామకృష్ణారావు, సెక్రెటరీ వి రంగయ్య, క్లబ్ డైరెక్టర్లు జవహర్, ఎంవి రమణ, పాఠశాల ప్రధానోపాధ్యాయుడు శ్రీహరి చక్రవర్తి, ఉపాధ్యాయులు, లయన్స్ క్లబ్, సభ్యులు బొప్పరాజు శ్రీనివాసులు, శ్రీకాంత్, రిబ్బమ్మలు పాల్గొని వీరు కూడా విద్యార్థులకు స్టీల్ వాటర్ బాటిళ్లను, బిస్కెట్ ప్యాకెట్లను కూడా అందజేశారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న విద్యార్థినీ, విద్యార్థుల తల్లిదండ్రులు, గ్రామ ప్రజలు లయన్స్ క్లబ్ అధ్యక్షులు కశ్శెట్టి జగన్‌ను అభినందించారు.

## స్వర్ణాంధ్ర- స్వచ్ఛ ఆంధ్ర స్వచ్ఛ పథం కార్యక్రమం ప్రతి ఒక్కరూ ప్లాస్టిక్ ని నిషేధించాలి

### పర్యావరణాన్ని కాపాడాలి

### డిప్యూటీ ఎంపీడీవో హజరత్ అలి




(షణ్ముఖ వెలుగు, కనిగిరి టౌన్, ఆగస్టు 5)

స్వర్ణాంధ్ర స్వచ్ఛ ఆంధ్ర ప్రతి బుధవారం స్వచ్ఛ పదం కార్యక్రమంలో భాగంగా మండల పరిషత్ కార్యాలయంలో స్వయంకృషి సేవాసంస్థ అధ్యక్షులు డాక్టర్ షేక్ నాయబ్ రసూల్ ఆధ్వర్యంలో బుధవారం కార్యక్రమాన్ని నిర్వహించినారు. ఈ సందర్భంగా డిప్యూటీ ఎండిఓ మాట్లాడుతూ గ్రామాల్లోని రోడ్లు, డ్రైనేజీ కాలువలు శుభ్రం చేయాలని కోరారు. ప్రతి ఒక్కరూ సింగిల్ యూజ్ ప్లాస్టిక్ కవర్లు నిషేధించాలని అన్నారు. రీసైక్లింగ్ చేసే పద్ధతి లేకపోవడంతో 120 మైక్రాల కంటే తక్కువ మందం కలిగిన ప్లాస్టిక్ వస్తువులన్నిటి పైన కేంద్ర ప్రభుత్వం నిషేధించింది. ప్లాస్టిక్ స్టిక్స్ ఉన్న ఇయర్ బర్ట్స్, బెలూన్లు, ప్లాస్టిక్ జెండాలు ,ప్లాస్టిక్ పుల్లలు, కవర్లు తదితర 16 రకాల వివిధ వస్తువుల్ని నిబంధనని ఉల్లంఘించి ఈ వస్తువులు ఎవరు తయారు చేసిన వినియోగించిన ఐదేళ్లు జైలు శిక్ష లక్ష రూపాయలు జరిమానా విధించే అవకాశం ఉందని అన్నారు. స్వయంకృషి సేవాసంస్థ అధ్యక్షులు డాక్టర్ షేక్ నాయబ్ రసూల్ మాట్లాడుతూ ప్రతి నిమిషానికి ఒక లారీ ప్లాస్టిక్‌తో నిండుతుంది. కావున ప్లాస్టిక్ తో పర్యావరణానికి ముప్పు పెరుగుతుందని రోజు రోజుకు కొండలా పెరిగిపోతున్న ప్లాస్టిక్ వ్యర్థాలు కనిపిస్తున్నాయన్నారు. ప్లాస్టిక్ పూర్తిగా నిర్మూలించకపోతే ముందు తరాల వారికి ప్లాస్టిక్ వ్యర్థాల వలన పెనుముప్పు ప్రమాదం ఏర్పడే అవకాశం ఉందని క్యాన్సర్‌కు కారణం కేవలం ప్లాస్టిక్ మాత్రమేనని కొన్ని పరిశోధనల్లో తేలింది అన్నారు. కావున ప్లాస్టిక్ పాలిథిన్ కవర్లను పూర్తిస్థాయిలో నిషేదిద్దామన్నారు. సాధ్యమైనంత వరకు ప్లాస్టిక్ వాడకాన్ని నిషేధించి పర్యావరణ పరిరక్షణలో ప్రతి ఒక్కరు భాగస్వాములు అవుదామన్నారు. ఈ కార్యక్రమంలో అంగన్వాడి సూపర్వైజర్ గోళ్ల పద్మజ, పార్వతి, ఏపీఓ మాల్యాద్రి, వివిధ మండల శాఖ అధికారులు, పంచాయతీ కార్యదర్శులు, సచివాలయ ఇంజనీరింగ్ అసిస్టెంట్లు, తదితరులు పాల్గొన్నారు.

## కనిగిరి మున్సిపాలిటీలో అభివృద్ధి పనులు

(షణ్ముఖ వెలుగు, కనిగిరి టౌన్, ఆగస్టు 5)







కనిగిరి మున్సిపాలిటీలో పార్కులు, రోడ్లకు ఇరువైపులా మొక్కల పెంపు, సుందరీకరణ కోసం ప్రత్యేక అభివృద్ధి పనులు చేయనున్నట్లు శాసనసభ్యులు డాక్టర్ ముక్కు ఉగ్ర నరసింహారెడ్డి అన్నారు. బుధవారం పురపాలక సంఘం పరిధిలోని నాగులచెరువు, దొరువు, పెద్దచెరువు, బోర్డు స్కూల్ తదితర ప్రాంతాలలో ఎంఎల్ఎ ఉగ్ర నరసింహారెడ్డి, ఆంధ్రప్రదేశ్ గ్రీనింగ్ అండ్ బ్యూటిఫికేషన్ కార్పొరేషన్ జోనల్ మేనేజర్, మునిసిపల్ కమీషనర్ శ్రీధర్‌లు పర్యటించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే ఉగ్ర నరసింహారెడ్డి మాట్లాడుతూ కనిగిరి పట్టణంలో దొరువును అభివృద్ధి చేసి ఆహ్లాదకరంగా ఉండేందుకు ప్రత్యేక ప్రణాళికలు సిద్ధం చేయనున్నట్లు తెలిపారు. నాగులచెరువు, పెద్ద చెరువుల అభివృద్ధి కోసం ప్రత్యేక టెండర్లు, ప్రణాళికలు సిద్ధం చేయాలని అధికారులకు సూచించారు. పార్కుల అభివృద్ధికి, ఆంధ్రప్రదేశ్ గ్రీనింగ్ అండ్ బ్యూటిఫికేషన్ కార్పొరేషన్ ద్వారా పచ్చదనం పెంపు, పట్టణాల సుందరీకరణ, మరియు పార్కుల అభివృద్ధి వంటి కార్యక్రమాలను నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఆంధ్రప్రదేశ్ గ్రీనింగ్ అండ్ బ్యూటిఫికేషన్ కార్పొరేషన్ జోనల్ మేనేజర్ బేబీ మాట్లాడుతూ మేనేజింగ్ డైరెక్టర్ ఆదేశాల మేరకు కనిగిరి పట్టణంలో పార్కులు, రోడ్లకు ఇరువైపులా మొక్కల పెంపు, మరియు సుందరీకరణ కోసం ప్రత్యేక టెండర్లు, ప్రణాళికలు తయారు చేయనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో మునిసిపల్ కమీషనర్ పర్వతనేని శ్రీధర్, ఎపిజిబి అధికారులు సత్య, డిఈ రాజేంద్ర ప్రసాద్, అసిస్టెంట్ ఇంజనీర్ కోటేశ్వరరావు, నాయకులు, అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

## ఇండస్ట్రియల్ గ్రోత్ సెంటర్‌కు తమ వంతు సహకారం అందించాలి

### జిల్లా కలెక్టర్ పి రాజాబాబు









(షణ్ముఖ వెలుగు, ఒంగోలు, ఆగస్టు 5)

నిరుద్యోగులకు ఉపయోగ పడేలా నైపుణ్యతలో శిక్షణ ఇచ్చే విధంగా ఇండస్ట్రియల్ గ్రోత్ సెంటర్‌కు తమ వంతు సహకారం అందించాలని జిల్లా కలెక్టర్ పి రాజాబాబు పారిశ్రామికవేత్తలను కోరారు. బుధవారం పారిశ్రామిక అభివృద్ధి వాడలో విస్తృతంగా పర్యటించారు. అందులో భాగంగా క్వార్ట్జ్ టెక్, అంజలి గ్రానైట్, లిఖిత ఎనర్జీ సిస్టమ్స్ ప్రైవేట్ లిమిటెడ్, ప్రసాద్ ఆర్గానిక్ ప్రైవేట్ లిమిటెడ్ తదితర పరిశ్రమలలో ఉత్పత్తి సామర్థ్యాన్ని పరిశీలించారు. అనంతరం ఏపీఐఐ డీసీ కార్యాలయంలో పారిశ్రామికవేత్తలతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా పారిశ్రామిక వేత్తలు లేవనెత్తిన పలు అంశాలపై స్ట్రీట్ లైట్లు, డ్రైనేజీ సిస్టం ఏర్పాటు, పోలీస్ పెట్రోలింగ్, త్రాగునీటి సమస్య, అసాంఘిక కార్యక్రమాలు జరగకుండా నిరోధించే విధంగా తగు చర్యలు తీసుకోవడం జరుగుతుందని దీనిపై కమిటీని వేయడం జరుగుతుందన్నారు. అలాగే ఇండస్ట్రియల్ లోకల్ అథారిటీ ఏర్పాటుకు తనవంతు కృషి చేయడం జరుగుతుందని ఆయన అన్నారు. పారిశ్రామికుల నైపుణ్యత శిక్షణ సంస్థలలో శిక్షణ ఇచ్చి తగు కామన్ ప్లాట్ఫారమును ఏర్పాటు చేసే విధంగా చర్యలు తీసుకోవాలని దానికి తమ వంతు సహకారం ఉంటుందని ఆయన తెలిపారు. అర్హత ఉన్నవారికి ఉపాధి అవకాశాలు కల్పించాలని ఆయన సూచించారు. పారిశ్రామికవేత్తలు లేవనెత్తిన అంశాలపై స్పందిస్తూ దీనిపై అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించి అవసరమైన చర్యలు తీసుకోవడం జరుగుతుందన్నారు. ఇండస్ట్రియల్ లోకల్ అథారిటీ ఏర్పాటు అయిన తర్వాత బ్యూటిఫికేషన్ కు ప్రాధాన్యత ఇవ్వాలని, గ్రీనరీ పెంచాలని ఆయన కోరారు. సెంటర్ ఫర్ ఎక్సెలెన్సీ ఏర్పాటుకు భూమిని సమకూర్చడం జరుగుతుందని శాశ్వత ప్రాతిపదిగిన అక్కడ ఏర్పాటు చేయాలని ఆయన కోరారు. అందులో ఉత్సాహవంతులకు సరైన శిక్షణ ఇచ్చే విధంగా మిషనరీని ఏర్పాటు చేయాలని ఆయన కోరారు. స్కిల్ డెవలప్మెంట్ సెంటర్ కి అందరూ సమిష్టిగా కృషి చేసి గ్రేట్ సెంటర్ ను ఇండస్ట్రియల్ కారిడార్ కి అడాప్ట్ చేయడం జరుగుతుందన్నారు. ఇండస్ట్రియల్ గ్రోత్ సెంటర్ పారిశ్రామికవేత్తలకి జిల్లా యంత్రాంగానికి వారధి లాగా ఉండాలని ఆయన అభిప్రాయపడ్డారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఇండస్ట్రీస్ అధికారి శ్రీనివాసరావు, ఏపీఐఐడీసీ ఎస్ఎం మదన్ మోహన్, ఆర్డీవో చంద్రశేఖర్ నాయుడు, డిపిఓ అనుపమ, లేబర్ ఆఫీసర్ గౌస్ బాషా, పలువురు పారిశ్రామికవేత్తలు, తదితరులు పాల్గొన్నారు.

# అర్హత ఉన్న హెల్పరుకు ప్రమోషన్ ఇచ్చేంత వరకూ పోరాటం



(షణ్ముఖ వెలుగు, ఒంగోలు, ఆగస్టు 5)

టంగుటూరు ప్రాజెక్టు పాకల గ్రామంలో అర్హత ఉన్న హెల్పరుకు ప్రమోషన్ ఇచ్చేంత వరకూ పోరాటం కొనసాగుతుందని ఎపి అంగన్వాడీ వర్కర్స్ ఒహెల్పర్స్ యూనియన్ సిఐటియు జిల్లా ప్రధానకార్యదర్శి ఈదర అన్నపూర్ణ అన్నారు. బుధవారం ఒంగోలులోని ఐసిడియస్ పి. డి. ఆఫీస్ వద్ద 5 వ రోజు నిరసన కొనసాగింది. ఈ సంధర్భంగా అన్నపూర్ణ మాట్లాడుతూ హెల్పర్లకు ప్రమోషన్స్ ఇవ్వడంలో అధికారులు నిబంధనలు పాటించకుండా ప్రజాప్రతినిదుల వద్ద మెప్పుపొందెందుకు అంగన్వాడీ హెల్పర్లకు అన్యాయం చేస్తున్నారన్నారు. సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు సిహెచ్ మజుందార్ మాట్లాడుతూ నిభందనలకు విరుద్ధంగా ఇచ్చిన నోటిఫికేషన్ రద్దుచేసి పాకల హెల్పర్ జ్యోతికి ప్రమోషన్ ఇవ్వాలన్నారు. జిల్లా కలెక్టర్ జోక్యం చేసుకోని నోటిఫికేషన్ కి సిఫార్స్ చేసిన ఐసిడియస్ అదికారులపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలన్నారు. ఐసిడియస్ అధికారులు, యూనియన్ ప్రతినిధులతో జాయింట్ మీటింగ్ ఏర్పాటుచేసి ఎప్పటికప్పుడు చర్చించకపోవడమే ఇలాంటి అక్రమాలకు మూలం అన్నారు. అనంతరం ఐసిడియస్ జిల్లా పిడి కి వినతిపత్రం ఇచ్చారు. ఈ కార్యక్రమంలో అంగన్వాడీ యూనియన్ జిల్లా అధ్యక్షురాలు సిహెచ్ ఇందిరావతి, టంగుటూరు ప్రాజెక్టు అధ్యక్ష, కార్యదర్శులు శేషమ్మ, క్రాంతి కుమారి, ఒంగోలు, మద్దిపాడు, ప్రాజెక్టు కార్యదర్శులు కె హెమీమా, యన్ ధనలక్ష్మిలు పాల్గొన్నారు.

# సాదాసీదాగా ముగిసిన మండల సర్వసభ్య సమావేశం





(షణ్ముఖ వెలుగు, తర్లుపాడు, ఆగస్టు 5)

స్థానిక మండల పరిషత్ కార్యాలయ ఆవరణలో మండల ఎంపీపీ సూరెడ్డి భూలక్ష్మి అధ్యక్షతన సమావేశం ఉదయం 11 గంటల సమయంలో ప్రారంభమైంది. ఈ సందర్భంగా ఎంపీపీ భూలక్ష్మి మాట్లాడుతూ మండలంలోని ప్రజలందరికీ అందించాల్సిన మౌలిక వసతులను సంబంధిత ప్రజా ప్రతినిధులను అడిగి తెలుసుకున్నారు. దీంతో ప్రజా ప్రతినిధులు కొందరు గ్రామ ప్రజల అభ్యున్నతి కొరకు చేపట్టిన కొన్ని పనులకు బిల్లు ఇంకా రాలేదని ఆవేదన వ్యక్తం చేశారు. అందుకు సంబంధిత అధికారులతో చర్చించి వారి సమస్యలను వెంటనే పరిష్కరించాలని ఆమెకోరారు. అనంతరం శాఖల వారీగా అన్ని శాఖల అధికారులతో సభలో మాట్లాడించడం జరిగింది. సమావేశానికి పది మంది ఎంపీటీసీలు హాజరు కావలసి ఉండగా అందుకు గాను ముగ్గురు గైర్హాజరు కాగా మిగిలిన ఏడు మందితో అధికారులతో సమావేశం సాదాసీదాగా ముగిసింది. మండలంలో కొన్ని చోట్ల ఉపాధిహామీ కూలీలకు బిల్లు రాలేదని సభ దృష్టికి తేవడం జరిగింది. అంతే కాక మరికొందరు ఎంపీటీసీలు సభలో వారి సమస్యలను ఏకరువు పెట్టారు. అందుకు వారు అడిగిన సమస్యల పై సంబంధిత అధికారులతో సమాధానాలు చెప్పించడం జరిగింది. ఈ కార్యక్రమంలో ఏవో బుర్రి చంద్రశేఖర్, ఈఓఆర్‌డి రాఘవరావు, అన్ని శాఖల అధికారులు, ఎంపిటిసిలు పాల్గొన్నారు.

# చుండూరు నరమేధం జరిగి 35 ఏళ్ళైనా ఎండమావిగా మారిన సుప్రీమ్ న్యాయం

## దళిత నేత నీలం నాగేంద్రరావు

(షణ్ముఖ వెలుగు, చీమకుర్తి, ఆగస్టు 5)



చుండూరు నరమేధం జరిగి 35 ఏళ్ళైనా ఎండమావిగా మారిన సుప్రీమ్ న్యాయం 6 తేదీన చుండూరు మృతవీరుల 35వ స్మారక సదస్సు నిర్వహిస్తున్నామని దళిత హక్కుల పరిరక్షణ సమితి అధ్యక్షులు నీలం నాగేంద్రరావు తెలిపారు. బుధవారం సాయంత్రం చీమకుర్తిలో జరిగిన కార్యక్రమంలో నీలం నాగేంద్రరావు మాట్లాడుతూ 1991 ఆగస్టు 6న చుండూరులో అప్పటి కాంగ్రెస్ ప్రభుత్వంలో మాలపల్లిను చుట్టుముట్టి పోలీస్ బలగాల సహాయంతో కాంగ్రెస్ పార్టీ రెడ్లు మాలలను ఊచకోత కోశారన్నారు. చుండూరు నరమేధంలో పదిమంది మాలలు కాంగ్రెస్ రెడ్ల కుల అహంకారానికి కండకావురానికి బలయ్యరన్నారు. మాలల రక్తంతో చుండూరులోని తుంగభద్ర నది రక్తదారగా మారిందన్నారు. చుండూరు మృతవీరుల త్యాగ ఫలితమే భారతదేశం దళితులు అనుభవిస్తున్న ఎస్సీ ఎస్టీ, యాక్ట్ అన్నారు. భారతదేశ దళితుల దిశా,,దశ తలరాతలను మార్చిన పోరు పతాకమై నిలిచిన చుండూరు మృతవీరులకు స్మరించుకోవలసిన బాధ్యత దళిత జాతి పై ఉందన్నారు. చుండూరు మారణకాండ భారత దేశ దళిత ఉద్యమాలలో వేగుచుక్క అన్నారు. దళితున్ని రాష్ట్రపతి చేసింది చుండూరు ఉద్యమమే అన్నారు. హైకోర్టులో చుండూరు అగ్రకుల రెడ్డి హంతకులందరూ నిర్దోషిలేనని ప్రకటించి,న్యాయవ్యవస్థ ఇచ్చిన మనువాద తీర్పును దేశవ్యాప్తంగా దళితులు వ్యతిరేకించి ఉద్యమాలు చేశారన్నారు. ప్రస్తుతం సుప్రీంకోర్టులో చుండూరు కేసు మనువాద కమల న్యాయాధిపతుల విచారణ కు 35 ఏళు అయినా రాలేదన్నారు. చుండూరు మృతవీరులకు న్యాయం కోసం ఈ నెల 6 తేదీన దళితులందరూ నిరసన కార్యక్రమాలు నిర్వహించాలని దళిత హక్కుల పరిరక్షణ సమితి అధ్యక్షులు నీలం నాగేంద్రరావు విజ్ఞప్తి చేశారు. కార్యాలయంలో ఉదయం 10 గంటలకు జరుగునున్న చుండూరు నరమేధ సదస్సును జయప్రదం చేయాలని దళిత హక్కుల పరిరక్షణ సమితి అధ్యక్షుడు నీలం నాగేంద్రరావు విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో సామాజిక ఉద్యమకారులు పాలేటి కోటేశ్వరరావు, మాల మహానాడు జిల్లా అధ్యక్షులు దారా అంజయ్య, కార్యదర్శి కాకుమాను రవి, కోల జీవరత్నం, పాటూరు సిద్దయ్య, పత్రా బంగారం తదితరులున్నారు.

# నేడు మార్టూరు, చిన్నగంజాంలో ఎమ్మెల్యే ఏలూరి పర్యటన

(షణ్ముఖ వెలుగు, పర్చూరు, ఆగస్టు 5)



మార్టూరు, చిన్నగంజాం మండలాల్లో గురువారం ఎమ్మెల్యే ఏలూరి సాంబశివరావు విస్తృతంగా పర్యటించనున్నారు. పలు అభివృద్ధి కార్యక్రమాల్లో పాల్గొనడంతో పాటు ప్రజల నుంచి అర్జీలు స్వీకరించనున్నారు. ఉదయం 10 గంటలకు ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో 50 మందికి రూ.25.98 లక్షల విలువైన సీఎంఆర్ఎఫ్ చెక్కులను అందజేస్తారు. అనంతరం 11 గంటలకు ప్రజాదర్బార్ నిర్వహించి ప్రజల నుంచి అర్జీలు స్వీకరిస్తారు. మధ్యాహ్నం 12 గంటలకు 'ఇంటింటికీ తెలుగుదేశం' కార్యక్రమంపై నిర్వహించే సమీక్షలో పాల్గొంటారు. మధ్యాహ్నం 2 గంటలకు చిన్నగంజాం మండలం కొత్తపాలెంలో సుమారు రూ.కోటి వ్యయంతో నిర్మించిన 33 కేవీ అత్యవసర విద్యుత్ లైన్‌ను ప్రారంభిస్తారు. అనంతరం రామచంద్రనగర్‌లో రూ.8 లక్షల వ్యయంతో 8 కిలోమీటర్ల మేర నిర్మించిన 11 కేవీ ఫీడర్ లైన్‌ను ప్రారంభిస్తారు. మధ్యాహ్నం 3 గంటలకు చిన్నగంజాంలోని కేజీబీవీ పాఠశాలలో రూ.2.46 కోట్లతో నిర్మించిన వసతిగృహం, అదనపు తరగతి గదులు, కంప్యూటర్ రూమ్, బయాలజీ ల్యాబ్‌లను ప్రారంభిస్తారు. సాయంత్రం 4 గంటలకు చిన్నగంజాం మండల పరిషత్ కార్యాలయం వద్ద ఎస్సీ కాలనీలో 'ఇంటింటికీ తెలుగుదేశం' కార్యక్రమంలో పాల్గొంటారు. సాయంత్రం 6 గంటలకు బాపట్లలో మంత్రులు, ఎమ్మెల్యేల ఆత్మీయ సమావేశానికి హాజరవుతారు. ఎమ్మెల్యే పర్యటనకు సంబంధించి పార్టీ నాయకులు, అధికారులు ఏర్పాట్లు చేస్తున్నారు.

# సామాన్యుడికి అండగా కూటమి ప్రభుత్వం

## తక్కువ ధరకే బియ్యం స్టోర్ ప్రారంభం



(షణ్ముఖ వెలుగు, చిన్నగంజాం, ఆగస్టు 5)

పెరిగిన బియ్యం ధరలను నియంత్రించడంతోపాటు ప్రజలకు ఆర్థిక ఉపశమనం కలిగిస్తూ, బహిరంగ మార్కెట్ కంటే తక్కువ ధరకే బియ్యం విక్రయాల కౌంటర్ ను చిన్నగంజాం మండల ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని మండల తెదేపా అధ్యక్షుడు పోద వీరయ్య అన్నారు. బుధవారం చిన్నగంజాం గ్రామంలోని మార్కెట్ సెంటర్ నందు మండల తెదేపా నాయకులు తక్కువ ధరలకే బియ్యం అందించే ప్రత్యేక కౌంటర్‌ను ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మాటల్లో కాదు – చేతల్లో సంక్షేమం" అనే ధ్యేయంతో కూటమి ప్రభుత్వ సహకారంతో సదరు విక్రయ కేంద్రంలో తగ్గించిన ధరలకే నాణ్యమైన బియ్యాన్ని ప్రభుత్వం అందుబాటులోకి తెచ్చిందని తెలిపారు. ఈ కార్యక్రమంలో పోద వీరయ్య చౌదరి,అబ్దుల్ కలాం అజాద్, నరహరి శ్రీనివాసరావు, చెరుకూరి రాఘవయ్య, రాయిని ఆత్మరావు, షేక్ జిలాని, శివ, తుమ్మలపెంట జయరాం, ఏసునారాయణ, రమణ, నాంచారులు, కూటమి నాయకులు పాల్గొన్నారు.

# కలెక్టర్ ఎన్ ప్రభాకర్‌రెడ్డిని ప్రతి ఒక్కరూ ఆదర్శంగా తీసుకోవాలి

(షణ్ముఖ వెలుగు, ఒంగోలు, ఆగస్టు 5)



కలెక్టర్ ఎన్ ప్రభాకర్‌రెడ్డిని ఆదర్శంగా తీసుకొని రాజకీయ నాయకులు, అధికారులు ప్రభుత్వ పాఠశాలలో తమ పిల్లలను చేర్పించాలని కాంగ్రెస్ పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి పైనం మధు ఓ ప్రకటనలో కోరారు. ఈ సందర్భంగా పార్వతీపురం మన్యం జిల్లా కలెక్టర్ ఎన్ ప్రభాకర్‌రెడ్డికి అభినందనలు తెలియజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పార్వతీపురం మన్యం జిల్లా కలెక్టర్ ఎందరో అధికారులకి ఆదర్శవంతంగా నిలిచారని కొనియాడారు. మన్యం జిల్లా కలెక్టర్ తన కుమారుడు క్రిష్ ధరన్‌రెడ్డిని పార్వతీపురం లోని డాక్టర్ దుండిగల్ వెంకట్రావు మెమోరియల్ మున్సిపల్ హైస్కూల్ నందు పదవ తరగతికి జాయిన్ చేశారు. అంతే కాకుండా తను గతంలో పనిచేసిన జిల్లా నందు కూడా తన పిల్లల్ని గవర్నమెంట్ స్కూల్‌లో జాయిన్ చేసి ఆదర్శవంతంగా నిలిచారన్నారు. సమాజంలో ఇలాంటి అధికారులు జిల్లాకి ఒక్కరు ఉన్నా కూడా ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థుల సంఖ్య పెరిగి తద్వారా ఉపాధ్యాయుల్లో కూడా బాధ్యతాయుత భావన పెరుగుతుందన్నారు. ముఖ్యంగా మన సమాజంలో కొంతమంది రాజకీయ నాయకులైన మన్యం జిల్లా కలెక్టర్‌ని ఆదర్శంగా తీసుకుంటే ఆంధ్రప్రదేశ్‌లోని ప్రతి జిల్లా ప్రభుత్వ బడుల రూపురేఖలు మారుతాయనడంలో ఎలాంటి సందేహం లేదని పైనం మధు అన్నారు.

# ఒంగోలులో రెండు ఇళ్లలో భారీ చోరీలు

## పట్టపగలే దొంగతనం
## ఆంధ్రకేసరి నగర్ ఇంట్లో 30 సవర్ల మేర బంగారం
## సమతా నగర్ ఇంట్లో రూ.5 లక్షలు నగదు, 20 సవర్ల బంగారం చోరీ

(షణ్ముఖ వెలుగు, ఒంగోలు, ఆగస్టు 5)

ఒంగోలు నగరంలో పట్టపగలే రెండు ఇళ్లల్లో భారీ చోరీ జరగటంతో పట్టణ ప్రజలు భయభ్రాంతులకు గురవుతున్నారు. ఆంధ్ర కేసరి కాలనీ ఒకటవ లైన్‌లో నివాసం ఉంటున్న సుజాత ఇంటిలో ఈ దొంగతనం బుధవారం చోటుచేసుకుంది. బాధితురాలు సుజాత చెప్పిన వివరాల మేరకు తాను ఇంటికి తాళం వేసి మధ్యాహ్నం 11 గంటల సమయంలో కిరాణా కొట్టుకు వెళ్లానని, మధ్యాహ్నం ఒంటిగంట సమయంలో ఇంటికి రాగా, పైనుండి కిందకి ఒక వ్యక్తి వస్తున్నారని, అతనిని ఆపి ప్రశ్నించగా, తాను పై అంతస్తులో ఉంటున్న బ్యాచిలర్స్ ను కలిసేందుకు వచ్చానని చెప్పి వెళ్లిపోయారని సుజాత తెలిపారు. అయితే పైకి వెళ్లి చూడగా ఇంటి గేటు తాళం బద్దలు కొట్టి, ఇంటి తలుపులు తీసి, బీరువాలోని వస్తువులు చిందరవందరగా చేసి ఉన్నాయని, 30 సవర్ల బంగారం దొంగతనానికి గురైనట్లు గుర్తించామని తెలిపారు. పోలీసులను వెంటనే



ఆశ్రయించగా, పోలీసులు దర్యాప్తు చేస్తున్నారని వివరించారు. సమతా నగర్ లోని సమతా నగర్ రెండవ లైన్ లో నివాసం ఉంటున్న దమాల నాగరాజు ఇంట్లో కూడా బుధవారం చోరీ చోటు చేసుకుంది రూ.5 లక్షల నగదు, 20 సార్లు బంగారం, భార్య భర్త ఇద్దరు ఉద్యోగానికి వెళ్లి 5 గంటల ప్రాంతంలో ఇంటికి వచ్చేసరికి ఇంట్లోని రెండు బెడ్ రూమ్‌లలోని బీరువాలను తెరిచి ఈ దొంగతనం చేశారని కన్నీటి పర్యంతమయ్యారు. బ్యాంకు రుణం రూపంలో తెచ్చుకున్న నగదు కవర్‌తో సహా ఎతికెళ్లారని వాపోయారు. దొంగతనాలు జరిగిన ప్రదేశాలను తాలూకా సిఐ టి విజయకృష్ణ పరిశీలించారు. ఏదేమైనా పట్టపగలే జరుగుతున్న ఈ దొంగతనాల పై ఒంగోలు నగర వాసులు భయభ్రాంతులకు గురవుతున్నారు.









On behalf of PRINTER, PUBLISHER OWNED BY OBULASETTY RADHAKRISHNA DASS AND PRINTED AT HARI PRINTERS AND PUBLICATIONS, FLOT 51, NEAR B.V.SUBBAIAH SCHOOL ROAD, PERNAMITTA, SANTANUTALAPADU (MANDAL), PRAKASAM/ONGOLE (Dt), ANDHRA PRADESH, PIN : 523225. Mobile : 9494177939, RNI : APTEL/2023/89152, e-mail : rkreport9@gmail.com. E-Paper : shanmukhavelugu.com

## తిమ్మన్నపాలెం అపార్ట్‌మెంట్‌లో చోరీ



(షణ్ముఖ వెలుగు, కొరిశపాడు, ఆగస్టు 5)
కొరిశపాడు తిమ్మన్నపాలెం గ్రామంలో బుధవారం భారీ దొంగతనం చోటుచేసుకుంది. గ్రామంలోని తెల్లపాటి రాఘవ నివాసముంటున్న అపార్ట్‌మెంట్ నాలుగో అంతస్తులో గుర్తుతెలియని దుండగులు చోరీకి పాల్పడ్డారు. రాఘవ తన భార్యను ఉద్యోగ నిమిత్తం ఒంగోలులో దింపి తిరిగి ఇంటికి చేరుకోగా, ఇంటి తాళాలు పగులగొట్టి సామగ్రిని చిందరవందరగా వేసినట్లు గుర్తించారు. వెంటనే పోలీసులకు సమాచారం అందించారు. సమాచారం అందుకున్న ఎస్సై రమేష్ సిబ్బందితో కలిసి ఘటనాస్థలానికి చేరుకుని పరిశీలించారు. క్లూస్ టీంను రప్పించి వేలిముద్రలు సేకరించారు. చోరీకి గురైన నగదు, బంగారం, ఇతర విలువైన వస్తువుల వివరాలను ఆరా తీస్తున్నామని, ఎంత మేర నష్టం జరిగిందన్నది దర్యాప్తులో తేలుతుందని ఎస్సై రమేష్ తెలిపారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

## ఇంటింటికీ తెలుగుదేశం
## ప్రజలతో మమేకమైన గూడూరి ఎరిక్షన్ బాబు








(షణ్ముఖ వెలుగు, దోర్నాల, ఆగస్టు 5)
దోర్నాల మండలంలోని చిన్న దోర్నాల గ్రామంలో నిర్వహించిన ఇంటింటికీ తెలుగుదేశం కార్యక్రమంలో భాగంగా యర్రగొండపాలెం నియోజకవర్గం టీడీపీ ఇంచార్జి గూడూరి ఎరిక్షన్ బాబు ఇంటింటికీ వెళ్లి ప్రజలను ఆప్యాయంగా కలుసుకుని, పార్టీ కరపత్రాలను అందజేశారు. ఈ సందర్భంగా తెలుగుదేశం ప్రభుత్వం అమలు చేస్తున్న ప్రజా సంక్షేమ పథకాలు, అభివృద్ధి కార్యక్రమాలను గ్రామ ప్రజలకు వివరించి, వారి సమస్యలను తెలుసుకొని పరిష్కారానికి హామీ ఇచ్చారు. అనంతరం నిర్వహించిన గ్రామ సమావేశంలో గత రెండేళ్లుగా ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు నాయకత్వంలో యర్రగొండపాలెం నియోజకవర్గంలో జరిగిన అభివృద్ధి పనులు, అమలవుతున్న సంక్షేమ పథకాలు, తల్లికివందనం, స్త్రీ శక్తి, అన్నదాత సుఖీభవ, దీపం గురించి ప్రజలకు వివరించారు. అనంతరం చిన్న దోర్నాల గ్రామంలోని రైతులకు ప్రభుత్వ పట్టాదారు పాస్ పుస్తకాలను పంపిణీ చేయడం జరిగింది. ఈ కార్యక్రమంలో దోర్నాల అశోక్‌రెడ్డి, మండల టీడీపీ అధ్యక్షులు షేక్ మహబూబ్ సాహెబ్, అధికారులు, మండల కూటమి నాయకులు, బోడె నాయక్ తండా పంచాయతీ నాయకులు, పార్టీ కార్యకర్తలు, మహిళలు, గ్రామ ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## పంటల బీమా, ఈ పంట నమోదు పై రైతులకు అవగాహన




(షణ్ముఖ వెలుగు, పొదిలి, ఆగస్టు 5)
మండలంలోని యేలూరు, టి సల్లూరు గ్రామాల్లో బుధవారం పొలం పిలుస్తోంది కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా మండల వ్యవసాయ అధికారి దేవిరెడ్డి శ్రీనివాసులు మాట్లాడుతూ ప్రస్తుత ఖరీఫ్ సీజన్‌లో రైతులు సాగు చేసిన ప్రతి పంటనూ తప్పనిసరిగా ఈ పంటలో నమోదు చేయించుకోవాలని కోరారు. పంటల బీమా పరిధిలోకి వచ్చే పంటలకు రైతులు వెంటనే బీమా నమోదు చేసుకోవాలని సూచించారు. అనంతరం గ్రామాల్లోని సజ్జ తదితర పంటలను ఆయన పరిశీలించారు. ప్రస్తుతం పొలాల్లో బెట్ట పరిస్థితులు కనిపిస్తున్నందున, బోరు బావుల వసతి ఉన్న రైతులు వెంటనే పంటలకు నీటి తడులు అందించాలని, అవసరం మేరకే ఎరువులు వాడాలని మెలుకువలు తెలిపారు. ప్రభుత్వ నిబంధనల ప్రకారం ఆగష్టు 15వ తేదీ లోపు రైతులు పంటల బీమా చెల్లించాలని తెలిపారు. రైతులు తమ ఆధార్ కార్డు, పట్టాదారు పాసుబుక్, పంట ధ్రువీకరణ పత్రం, బ్యాంక్ ఖాతా వివరాలు మరియు ఫోన్ నంబర్‌తో సమీపంలోని కామన్ సర్వీస్ సెంటర్‌ను సందర్శించి స్వతహాగా పంట బీమా నమోదు చేసుకోవచ్చని ఆయన స్పష్టం చేశారు. కార్యక్రమంలో గ్రామ వ్యవసాయ సహాయకులు, ఆయా గ్రామాల రైతులు పాల్గొన్నారు.

# రైతులు తక్కువ కాలపరిమితి గల పంటలను సాగు చేయాలి

(షణ్ముఖ వెలుగు, పొన్నలూరు, ఆగస్టు 5)
మండలంలోని తిమ్మపాలెం మాలేపాడు, రాజోలిపాడు బాలిరెడ్డి పాలెం, చెన్నుపాడు గ్రామాలలో బుధవారం వ్యవసాయ అధికారి బి రాము ఆధ్వర్యంలో పొలం పిలుస్తుంది కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆచార్య ఎన్జీరంగా వ్యవసాయ విశ్వవిద్యాలయం శాస్త్రవేత్తలు ఎల్ నినొ పర్యవేక్షణ టీం పాల్గొని రైతులకు పంటలపై తగు సూచనలు తెలిపారు. దర్శి వ్యవసాయ పరిశోధన స్థానం ప్రధాన శాస్త్రవేత్తలు డాక్టర్లు సిహెచ్ వరప్రసాద్, జి రమేష్ బాబు మాట్లాడుతూ ఎల్ నీనొ ప్రభావం వల్ల వర్షం చాలా తక్కువగా ఉంటుంది కావున రైతులు ఎక్కువ నీరు ఆశించే పంటలు కాకుండా తక్కువ నీటితో పెరిగే పంటలు సాగు చేయటం చాలా మంచిదని అన్నారు. రైతులు ప్రత్యామ్నాయ పంటలైన కొర్రలు, సజ్జలు, సాములు, పెసర, మినుము, అలసంద, ఉలవలు వేసుకోవాలని రైతులకు సూచించారు. కంది పంట వేసుకునుటకు ఆగస్టు నెల ఆఖరి వరకు భూమిలో తేమను బట్టి వేసుకోవాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో వి శేషమ్మ, ప్రకృతి వ్యవసాయ సహాయకులు సహాయకులు మందాకిని, వ్యవసాయ సహాయకులు దివాకర్ నరసింహ మస్తాన్ మౌలాలి, కవిత, అనూష, హరి గ్రామ నాయకులు తదితరులు పాల్గొన్నారు.






# పోలీస్ అధికారుల సౌజన్యంతో గిద్దలూరు హై స్కూల్ ప్లస్ లో మొక్కలు నాటే కార్యక్రమం

(షణ్ముఖ వెలుగు, గిద్దలూరు, ఆగస్టు 5)
పట్టణంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ప్లస్ ఆవరణలో గిద్దలూరు సబ్ ఇన్స్పెక్టర్ అంకమ్మరావు ఆధ్వర్యంలో 50 మొక్కలను కళాశాల ప్రిన్సిపాల్ సిద్దేశ్వర శర్మకు అందించగా వాటిని ఎన్‌సిసి అధికారి పిచ్చయ్య, వ్యాయామ ఉపాధ్యాయులు శ్రీనివాసరెడ్డి తన క్యాడెట్లతో పాఠశాల ఆవరణలో నాటించడం జరిగింది. ఈ సందర్భంగా అంకమ్మరావు మాట్లాడుతూ పోలీస్ ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు ఈ కార్యక్రమం చేపట్టామని తెలియజేశారు. ప్రతి విద్యార్థి ఒక మొక్కను నాటి సంరక్షించాలని సూచించారు. అనంతరం ఇంటర్ చదువుతున్న విద్యార్థినిలకు కౌన్సిలింగ్, మార్గదర్శకత్వం చేశారు. ఈ కార్యక్రమంలో కళాశాల వైస్ ప్రిన్సిపాల్ బాల గురవయ్య, శ్రీరామి రెడ్డి,సగీర్, రాజేంద్రప్రసాద్, శోభారాణి, వెంకాయమ్మ, మరియంబీబి, పీరయ్య, స్వామి కుమార్, విజయరాజు, తదితరులు పాల్గొని ఎస్ఐను సన్మానించడం జరిగింది. కళాశాల ఆవరణలో మొక్కలు నాటించడానికి సహకరించిన పోలీసు ఉన్నతాధికారులకు ప్రిన్సిపాల్ సిద్దేశ్వర శర్మ ధన్యవాదాలు తెలిపారు.






# కాటూరివారిపాలెంలో ముమ్మరంగా ఇంటింటికీ కూటమి ప్రభుత్వం

## రెండేళ్ల అభివృద్ధి, సంక్షేమాన్ని వివరించిన ఎమ్మెల్యే కందుల

(షణ్ముఖ వెలుగు, పొదిలి, ఆగస్టు 5)
కూటమి ప్రభుత్వం సాధించిన విజయం, అమలవుతున్న సంక్షేమ పథకాలను ప్రజాక్షేత్రంలోకి తీసుకెళ్లే లక్ష్యంతో నగర పంచాయతీ పరిధిలోని కాటూరివారిపాలెంలో ఇంటింటికీ కూటమి ప్రభుత్వం సంక్షేమ విజయాలు కార్యక్రమం కోలాహలంగా సాగింది. మార్కాపురం శాసనసభ్యులు కందుల నారాయణ రెడ్డి నేతృత్వంలో బుధవారం ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో భాగంగా ఎమ్మెల్యే కందుల నారాయణ రెడ్డి గ్రామంలోని ప్రతి ఇల్లూ తిరిగి ప్రజలను ఆప్యాయంగా పలకరించారు. గత రెండేళ్ల కూటమి ప్రభుత్వ పాలనలో చేపట్టిన వివిధ అభివృద్ధి పనులు, అమలు చేసిన సంక్షేమ పథకాలను ఆయన ప్రజలకు పూసగుచ్చినట్లు వివరించారు. ఈ సందర్భంగా ప్రభుత్వ పథకాలు, సేవలకు సంబంధించిన సమాచార కరపత్రాలను స్థానికులకు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే కందుల నారాయణరెడ్డి మాట్లాడుతూ ప్రజల సంక్షేమమే ధ్యేయంగా కూటమి ప్రభుత్వం పనిచేస్తోందని, ఎటువంటి పక్షపాతం లేకుండా అర్హులైన ప్రతి పేద కుటుంబానికి సంక్షేమ ఫలాలు అందిస్తున్నామని తెలిపారు. గ్రామీణ ప్రాంతాల సమగ్ర అభివృద్ధితో పాటు రైతులు, మహిళలు, యువత, విద్యార్థుల అభ్యున్నతి కోసం ప్రభుత్వం ప్రత్యేక ప్రణాళికలతో ముందుకు సాగుతోందని పేర్కొన్నారు. కార్యక్రమంలో కూటమి నాయకులు, కార్యకర్తలు, స్థానిక ప్రజాప్రతినిధులు, పెద్ద ఎత్తున గ్రామస్థులు పాల్గొన్నారు.



## ది ఏలూరి కోఆపరేటివ్ అర్బన్ బ్యాంక్ నూతన బ్రాంచ్‌ను ప్రారంభించిన మాజీ మంత్రి శిద్ధా రాఘవరావు





(షణ్ముఖ వెలుగు, ఒంగోలు, ఆగస్టు 5)
ఒంగోలు పట్టణంలోని రాజాపానకల్ రోడ్డులో ఏర్పాటు చేసిన ది ఏలూరి కోఆపరేటివ్ అర్బన్ బ్యాంక్ నూతన బ్రాంచ్‌ను బుధవారం మాజీ మంత్రి శిద్ధా రాఘవరావు రిబ్బన్ కట్ చేసి ప్రారంభించారు. ఈ సందర్భంగా బ్యాంకు చైర్మన్ ఏలూరి గురవయ్య తన సిబ్బందితో కలసి శిద్ధా రాఘవరావుకి సాదర స్వాగతం పలికి పుష్పగుచ్ఛం అందచేసి స్వాగతం పలికారు. అనంతరం మాజీ మంత్రి శిద్ధా రాఘవరావు పూజలు నిర్వహించి జ్యోతి ప్రజ్వలనతో బ్యాంకు సేవలను లాంఛనంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రవ్యాప్తంగా అనేక బ్రాంచ్‌లు కలిగి బ్యాంకింగ్ సేవల్లో వినియోగదారుల మన్ననలు పొంది ఒంగోలులో నూతన బ్రాంచ్ ప్రారంభించడం సంతోషంగా ఉందన్నారు. ఈ సందర్భంగా బ్యాంకు చైర్మన్, సిబ్బందికి అభినందనలు తెలియజేస్తున్నానన్నారు. ఒంగోలులో నూతనంగా ప్రారంభించిన ఏలూరు బ్యాంకు దినదినాభివృద్ధి చెంది బ్యాంకు కస్టమర్స్ విశ్వాసాన్ని పొందాలని తాను మనస్ఫూర్తిగా కోరుకుంటున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఒంగోలు సూపర్ బజార్ మాజీ చైర్మన్ తాత ప్రసాద్, ఏలూరు బ్యాంక్ చైర్మన్ ఏలూరు గురవయ్య, బ్యాంకు డైరెక్టర్ ఏలూరు దత్త వెంకట కిరణ్, బ్యాంకు సీఈఓ షేక్ రియాజ్ అహ్మద్, బ్రాంచ్ మేనేజర్ గుండా వెంకట వరకుమార్, తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా బ్యాంక్ చైర్మన్ గురవయ్య శిద్ధా రాఘవరావుని శాలువతో సత్కరించి మెమంటో అందచేశారు.

## తల్లిపాలే బిడ్డకు అమృతం సూపర్వైజర్ వి లక్ష్మి



(షణ్ముఖ వెలుగు, తర్లుపాడు, ఆగస్టు 5)
మండల కేంద్రమైన తర్లుపాడు పంచాయితీలోని స్థానిక నాయుడుపల్లి కాలనీలోని అంగన్వాడి కేంద్రంలో తల్లిపాల వారోత్సవాల్లో భాగంగా సూపర్వైజర్ వి లక్ష్మి ఆధ్వర్యంలోకార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ వారోత్సవాలకు హాజరైన బాలింతలు, గర్భవతులతో ఆమె మాట్లాడుతూ గర్భవతులు, బాలింతలకి తల్లిపాల ప్రాముఖ్యతను గురించి తెలియజేయడమైనది. పుట్టిన ప్రతి బిడ్డకి ఒక గంటలోపే తల్లిపాలు పట్టించాలి. బిడ్డకి తల్లిపాలు అమృతం లాంటివి అన్నారు. బిడ్డ యొక్క మానసిక, శారీరక ఎదుగుదలకి తల్లిపాలే శ్రేష్టం. బిడ్డకి తల్లిపాలు ఉత్తమమైన ఆహారం. వ్యాధి నిరోధకశక్తిని పెంచుతుంది. బిడ్డ కోరినప్పుడల్లా పగలు, రాత్రి తల్లిపాలు ఇవ్వాలి. బిడ్డకు ఆరు నెలలు నిండేంత వరకు తల్లిపాలు మాత్రమే ఇవ్వాలి. మరి ఏ ఇతర ఆహారపదార్థాలు ఇవ్వకూడదు. బిడ్డకి ఆరు నెలలు నిండిన తర్వాత అదనపు ఆహారంతో పాటు రెండు సంవత్సరముల వరకు తల్లిపాలు కొనసాగించాలి. బిడ్డకు రెండు సంవత్సరములు వచ్చేంత వరకు ప్యాకెట్ ఫుడ్, పంచదార ఎక్కువగా ఉండే పదార్థాలు, స్వీట్స్, హాట్, చిప్స్, కేకులు, చాక్లెట్స్ ఇలాంటివి ఇవ్వకూడదు. వీటి వలన పిల్లలు తరచుగా అనారోగ్యంతో ఇబ్బంది పడతారన్నారు. ఈ కార్యక్రమంలో సూపర్వైజర్ వి లక్ష్మి ఆధ్వర్యంలో జరిపించారు. అంగన్వాడి కార్యకర్త శివ, ఆయా, గర్భవతులు, బాలింతలు పాల్గొన్నారు.

# హరితాంధ్ర కార్యక్రమంలో కంభం పోలీసుల భాగస్వామ్యం

## మొక్కలు నాటి పర్యావరణ పరిరక్షణకు పిలుపునిచ్చిన సీఐ మల్లికార్జున




(షణ్ముఖ వెలుగు, కంభం, ఆగస్టు 5)
జిల్లా ఎస్పీ హర్షవర్ధన్‌రాజు ఆదేశాల మేరకు రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన హరితాంధ్ర కార్యక్రమంలో భాగంగా కంభం పోలీస్ స్టేషన్ ఆవరణలో మొక్కలు నాటారు. ఈ కార్యక్రమంలో కంభం సర్కిల్ ఇన్‌స్పెక్టర్ మల్లికార్జున, కంభం ఎస్ఐ శివకృష్ణారెడ్డి, పోలీసు సిబ్బంది, మహిళా పోలీసు సిబ్బంది పాల్గొని మొక్కలను నాటారు. ఈ సందర్భంగా అధికారులు మాట్లాడుతూ ఈ రోజు నాటిన ప్రతి మొక్క రేపటి తరాలకు స్వచ్ఛమైన గాలి, ఆరోగ్యకరమైన పర్యావరణాన్ని అందిస్తుంది. ప్రతి ఒక్కరూ మొక్కలు నాటి వాటి సంరక్షణ బాధ్యతను కూడా తీసుకోవాలి అని సూచించారు. కార్యక్రమంలో పోలీసు సిబ్బంది ఉత్సాహంగా పాల్గొని పచ్చదనం పెంపొందించేందుకు తమ వంతు బాధ్యతను నిర్వర్తించారు.

